ప్రజాశక్తి

గురువారం 9 జనవరి 2025 8 పేజీలు

ప్రకాశం బాపట్ల

'ఆర్‌ఆర్‌ఆర్' కేసులో

విచారణకు తులసీబాబు హాజరు

- ఎస్పీ కార్యాలయం వద్ద
- టిడిపి కార్యకర్తల
- హంగామా

ఎస్పీ ఆఫీసు గేటు వద్ద పోలీసులతో తులసీబాబు అనుచరుల వాగ్వివాదం

ప్రజాశక్తి-ఒంగోలు బ్యూరో

డిప్యూటీ స్పీకర్ రఘు రామకృష్ణంరాజు కస్టోడియల్ టార్చర్ కేసులో మరో అనుమానితుడిగా ఉన్న తులసీబాబు అనే వ్యక్తి బుధవారం నాడు విచారణకు ఒంగోలు వచ్చారు. గుడివాడకు చెందిన ఈయన ప్రస్తుతం తెలుగుదేశంలో చేరారు. అక్కడ నుంచి విచారణకు వస్తూ భారీగా వాహనాలు, కార్యకర్తలతో ఎస్పీ కార్యాలయానికి చేరుకున్నారు. ఎస్పీ ఆఫీసు గేటు వద్ద కార్యకర్తలు హంగామా చేశారు. జై చంద్రబాబు, తెలుగుదేశం జిందాబాద్ అంటూ నినాదాలు చేశారు. లోపలకు అనుమతించాలని అక్కడ నుంచి వచ్చిన కొందరు తెలుగుదేశం కార్యకర్తలు హడావుడి చేశారు. పోలీసులు అడ్డుకున్నారు. కాసేపు ఉద్రిక్తత నెలకొంది. అనంతరం పోలీసులు తులసీ బాబును మాత్రమే లోపలకు అనుమతించారు. ఇక ఈ కేసులో తులసీబాబు అనే వ్యక్తి రఘురామ కృష్ణంరాజును కస్టోడియల్ టార్చర్ పెట్టిన సంఘటనలో ప్రత్యక్షంగా పాల్గొన్నట్లుగా భావించి విచారణకు పిలిచారు. రఘురామకృష్ణంరాజు ఇచ్చిన సమాచారం మేరకు ఇతన్ని విచారణకు పిలిచారు. అప్పట్లో వైసిపిలో ఉన్న ఈయన అప్పటి సిఐడి అధికారి సునీల్‌కుమార్‌కు సన్నిహితుడిగా ఉన్నట్లు సమాచారం. రఘురామ కృష్ణంరాజు తన గుండెలపై కూర్చున్న వ్యక్తిగా ఇతని పేరు చెప్పినట్లు వినికిడి. దీంతో ఇతన్ని విచారణకు పిలిచారు. ఈ కేసులో విచారణ అధికారిగా ఉన్న జిల్లా ఎస్పీ దామోదర్ అన్ని కోణాల్లో దర్యాప్తు చేపట్టారు. ఇందులో భాగంగానే తులసీబాబు అనే వ్యక్తిని విచారించారు. మరోసారి సిఐడి రిటైర్డ్ ఏఎస్పీ విజయపాల్‌ను కూడా విచారిస్తున్నట్లు సమాచారం.

ఆపగలరా..పందెం.?

- కోడిపందేలకు
- సిద్ధమవుతున్న బరులు
- అధికారపార్టీ ముఖ్యనేతల
- అనుచరులే నిర్వాహకులు
- పోలీసుల హెచ్చరికలూ
- లెక్కచేయని వైనం

కోడిపందెం బరులు ఏర్పాటుచేసేందుకు చదును చేసిన భూమి

ప్రజాశక్తి-రేపల్లె

సంక్రాంతి నేపథ్యంలో పందెం కోళ్లతో జూదరులు సమరానికి సిద్ధమవుతున్నారు. నియోజకవర్గంలోని తీర ప్రాంత గ్రామాలు జూద క్రీడలు, అసాంఘిక కార్యక్రమాలకు అడ్డాగా మారాయి. గతంలో ఎన్నడూ లేని విధంగా అధికారపార్టీకి చెందిన ముఖ్యనేతల అనుచరులు సంపాదనే ధ్యేయంగా జూద క్రీడల సాంప్రదాయాలకు తెరతీశారు. సం క్రాంతి పండుగను పురస్కరించుకుని రేపల్లె నియోజకవర్గంలోని చెరుకుపల్లి మండలం, పూషడపువారిపాలెం శివారు ప్రాంత పొలాలలో కోడిపందేలు నిర్వహించేందుకు కోడిపందేల బరులను సిద్ధం చేస్తున్నారు. అధికారపార్టీ ముఖ్య నేతల అండదండలు ఉండటంతో పోలీసుల హెచ్చరికలను కూడా లెక్క చేయటం లేదు.

సంప్రదాయం ముసుగులో కోడి పందేలు, పేకాట, మూడు ముక్కలాట లాటరీలు, గుండాట, కోతముక్క, బ్రాక్కెట్టు వంటి జూద క్రీడలు యథేచ్ఛగా నిర్వహించేందుకు అధికార పార్టీ నాయకులు రంగం సిద్ధం చేశారు. నాలుగు రోజుల పాటు పగలు, రాత్రి నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లూ చేశారు. గుంటూరు, కృష్ణ, బాపట్ల, ప్రకాశం, నెల్లూరు జిల్లాలతో పాటు తెలంగాణా నుంచి భారీగా జూదరులు వస్తారని అంచనాలు వేసుకుని ఆ స్థాయిలో ఏర్పాట్లు చేశారు. ఏటా సంక్రాంతి సమయంలో ముఖ్యంగా తీరప్రాంతం లో జరిగే కోడి పందేలను అడ్డుకుని తీరుతామంటూ పోలీసులు హెచ్చరిస్తుంటారు. పండగకు కొద్దిరోజుల ముందు కాస్త హడావుడి చేస్తారు. కానీ ఆ మూడు రోజులు మాత్రం పోలీస్‌స్టేషన్లకు అతి సమీపంలోనే పందేలు జరుగుతున్న చూసీచూడనట్లు ఉంటారు. ఈ ఏడాది కూడా కోడి పందేల నిర్వహణకు అనుమతి లేదంటూ పోలీసులు చెబుతున్నారు. అదే సమయంలో బహిరంగంగానే భారీ ఏర్పాట్లు మరోవైపు సాగుతున్నాయి. ఆర్థిక, రాజకీయ వ్యవహారాలతో ▶ 2లో

అధికార పార్టీలోకి

క్యూ కట్టిన వైసిపి కౌన్సిలర్లు..

- మార్కా'పుర'ంలో
- మారిన రాజకీయం

ప్రజాశక్తి-మార్కాపురం

మార్కా'పుర'ంలో అనూహ్య మార్పులు జరిగిపోతున్నాయి. వైఎస్‌ఆర్ కాంగ్రెస్ పార్టీకి చెందిన కౌన్సిలర్లు అధికార తెలుగుదేశం పార్టీలో చేరేందుకు క్యూ కట్టారు. ఒకరిద్దరు కాదు... ఏకంగా పది మందికి పైగా వైసిపిని వీడుతున్నట్లు సమాచారం.!

మార్కాపురం మున్సిపాలిటీలో 35 వార్డుల్లో వైఎస్‌ఆర్ కాంగ్రెస్ పార్టీకి 30 మంది కౌన్సిలర్లు ఉన్నారు. టిడిపికి ఐదుగురు మాత్రమే సభ్యులున్నారు. వైసిపికి చెందిన 23వ వార్డు కౌన్సిలర్లు దూదేకుల ప్రసాద్ మృతితో వైసిపి బలం 29కి చేరింది. రాష్ట్రంలో టిడిపి అధికారంలో ఉన్నా... మున్సిపాలిటీలో ఆ పార్టీ పెత్తనం సాగడం లేదు. మున్సిపాలిటీలో వైసిపినే బలంగా ఉంది. ఈ విషయం అధికార పార్టీకి మింగుడు పడటం లేదు. ఇటీవల కాలంలో జరిగిన కౌన్సిల్ సమావేశాల్లో ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి ▶ 2లో

విద్యుత్ సర్‌ఛార్జీలను

ప్రభుత్వమే భరించాలి

- ఆంధ్రప్రదేశ్ పట్టణ
- పౌరసంఘాల సమాఖ్య

ఎస్ఈకి వినతిపత్రం ఇస్తున్న సమాఖ్య నాయకులు

ప్రజాశక్తి-ఒంగోలు సిటీ

విద్యుత్ సర్‌ఛార్జీలను ప్రభుత్వమే భరించాలని ఆంధ్రప్రదేశ్ పట్టణ పౌర సంఘాల సమాఖ్య ప్రకాశం జిల్లా కన్వీనర్ చీకటి శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. బుధవారం నాడు ఆంధ్రప్రదేశ్ విద్యుత్ నియంత్రణ మండలి ప్రజాభిప్రాయ సేకరణలో ఆన్‌లైన్ పద్ధతి ద్వారా ఎస్ఈ కార్యాలయంలో చీకటి శ్రీనివాసరావు పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ 2014 నుంచి 2019 వరకు ఐదేళ్ళపాటు, అనంతరం వరుసగా 2022, 2023, 2024 ఆర్థిక సంవత్సరాలకు సంబంధించి ట్రూ అప్ ఛార్జీలతో పాటు మూడేళ్ల ఎఫ్‌పిపిసిఏ ఛార్జీలు వసూలు చేస్తూనే ఛార్జీలు యథాతథంగా ఉన్నాయని చెప్పడం ప్రజల్ని మభ్యపెట్టడమే నన్నారు. ఈ ప్రక్రియను ఇదే తీరులో కొనసాగించేందుకు ప్రభుత్వం వ్యూహాత్మక ప్రక్రియే ప్రజాభిప్రాయ సేకరణ అన్నారు. ఈ ప్రక్రియను తాము వ్యతిరేకిస్తున్నామని పేర్కొన్నారు. అనంతరం ఎస్ఈ కట్టా వెంకటేశ్వర్లుకు మెమోరాండం అందించారు. కార్యక్రమంలో దామా శ్రీనివాసులు, తంబి శ్రీనివాసులు, కొర్నెపాటి శ్రీనివాసరావు, కె విశ్వసిన్, వి.శ్రీధర్‌రావు, బండి సత్యనారాయణరావు పాల్గొన్నారు.

నాతో సహజీవనం చేయకుంటే..

ఫొటోలు ఇంటర్నెట్‌లో పెడతా..

- ఓ మహిళకు
- బిజెపి నేత బ్లాక్‌మెయిల్
- కేసు నమోదు చేసిన పోలీసులు

ప్రజాశక్తి-శింగరాయకొండ

తనతో సహజీవనం చేయకపోతే తాను దొంగ చాటుగా తీసిన ఫొటోలను ఇంటర్నెట్‌లో పెట్టి పరువు తీస్తానని ఓ బిజెపి నాయకుడు ఓ మహిళను బ్లాక్‌మెయిల్ చేస్తున్న ఘటన శింగరాయకొండలో వెలుగుచూసింది. బిజెపి నాయకుడి వేధింపులు భరించలేక సదరు మహిళ ఆత్మహత్య చేసుకోవాలనుకొని కూడా.. పిల్లలు గుర్తుకొచ్చి ఆగిపోయింది. బిజెపి నేత వేధింపులపై పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. బాధిత మహిళ ఫిర్యాదు మేరకు పోలీసులు బుధవారం కేసు నమోదుచేశారు.

శింగరాయకొండ మండలం, మూలగుంటపాడు గ్రామ పంచాయతీకి చెందిన బిజెపి నాయకుడు అంగలకుర్తి చెన్నయ్య అలియాస్ ఏసన్న భార్య వద్దకు ఓ మహిళ చేతివృత్తి పని నేర్చుకొనేందుకు వెళ్లింది. ఈ క్రమంలో సదరు మహిళను చెన్నయ్య లొంగదీసుకున్నాడు. ఆ సమయంలో రహస్యంగా ఫొటోలు, వీడియోలు తీశాడు. ఎలాగోలా అతడి నుంచి తప్పించుకొని సదరు మహిళ దూరంగా వెళ్లిపోయింది. బిజెపి నాయకుడు ఆమెను వదల్లేదు. తనతో సహజీవనం చేయాలని, లేకుంటే నీ ఫొటోలు, వీడియోలు ఇంటర్నెట్‌లో పెడతానని బెదిరించడం మొదలుపెట్టారు. అతని వేధింపులు తట్టుకోలేక సదరు మహిళ ఆత్మహత్య చేసుకునేందుకు కూడా ప్రయత్నం చేసి.. చివరకు పిల్లలు గుర్తుకు రావటంతో ఆగిపోయింది. శింగరాయకొండ పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి ఫిర్యాదు చేసింది. ఎస్ఐ బి.మహేంద్ర కేసు నమోదు చేశారు.

క్రికెట్ పోటీలను ప్రారంభిస్తున్న దృశ్యం

సంక్రాంతి క్రికెట్ కప్ పోటీలు ప్రారంభం

▶ 4లో

గృహనిర్మాణానికి రూ.2.5 లక్షల ఆర్థిక సాయం

జిల్లా కలెక్టర్ వెంకట మురళి

మాట్లాడుతున్న కలెక్టర్ వెంకట మురళి

ప్రజాశక్తి - బాపట్ల జిల్లా

జిల్లాలో అర్హులైన నిరుపేదలందరూ ప్రధాన మంత్రి ఆవాస్ యోజన 2.0 పథకం క్రింద ఇల్లు నిర్మించుకోడానికి కేంద్ర ప్రభుత్వం రూ.2.5 లక్షల ఆర్థిక సహాయం అందిస్తుందని జిల్లా కలెక్టర్ జె.వెంకట మురళి తెలిపారు. విజన్ బాపట్ల-2047 అమలు ప్రణాళికపై 14 శాఖల అధికారులతో బుధవారం స్థానిక కలెక్టరేట్లో ఆయన సమీక్ష నిర్వహించారు. బాపట్ల జిల్లా యుడిఐ పరిధిలో ఉన్నందున అర్హులైన నిరుపేదలందరికీ పిఎంఏవై 2.0 పథకం వర్తిస్తుందని కలెక్టర్ చెప్పారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకునేలా అవగాహన కల్పించాలన్నారు. సచివాలయాల స్థాయిలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. ఇల్లు నిర్మించుకోవడానికి కేంద్ర ప్రభుత్వం గొప్ప అవకాశం కల్పించిందన్నారు. సచివాలయాలలో తమ పేర్లు నమోదు చేసుకోవాలన్నారు. ఇంజినీరింగ్ అసిస్టెంట్ లాగిన్‌లో వారి వివరాలు పంపాలన్నారు. రాష్ట్రంలో ఒక లక్ష గహాల గృహ ప్రవేశాల కార్యక్రమం సందర్భంగా జిల్లాలో ప్రస్తుత పరిస్థితిపై కలెక్టర్ ఆరా తీశారు. ఉద్యాన రంగం ద్వారా జిల్లాలో కుటీర పరిశ్రమలు ఏర్పాటు చేసి ప్రజలకు ఉపాధి కల్పించాలన్నారు. జిల్లాలో ఇసుక రీచ్‌లలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి అక్రమ ఇసుక రవాణాను అరికట్టాలన్నారు. అటవీ శాఖ ద్వారా 4.13 లక్షల మొక్కలను నాటించి జిల్లాను పచ్చగా తీర్చిదిద్దాలన్నారు. బీచ్‌ల వద్ద 200 హెక్టార్లలో మడ మొక్కలను నాటి సుందరీకరించాలని అన్నారు. నాగార్జునసాగర్, ప్రకాశం బ్యారేజీ లోని నీటి నిల్వలపై ఆరా తీశారు. జిల్లాలోని అన్నా క్యాంటీన్లు సరైన సమయానికి తీయడం లేదనే ఫిర్యాదులు వస్తున్నాయన్నారు. పారిశుద్ధ్య సరిగా లేదని ఐవిఆర్ఎస్ కాల్స్ ద్వారా వచ్చిన ఫిర్యాదులను పరిష్కరించాలన్నారు. ఈ సమావేశంలో జిల్లా ప్రణాళిక అధికారి శ్రీనివాసరావు, 14 శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

జలవనరుల సంరక్షణకు నిధులు మంజూరు చేయాలి

జిల్లాలో జల వనరుల సంరక్షణ, పంట కాల్వలు, చెరువుల గట్ల బలోపేతానికి రూ 9.28 కోట్ల నిధులు అత్యవసరంగా కావాలని జిల్లా కలెక్టర్ జె వెంకట మురళి తెలిపారు. ఏపీ రాష్ట్ర విపత్తుల నిర్వహణ సాధికారత సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ ఆర్‌పి సిసోడియ అమరావతి నుంచి బుధవారం అన్ని జిల్లాల కలెక్టర్లతో వీక్షణ సమావేశం నిర్వహించారు. సెప్టెంబర్ నెలలో బాపట్ల జిల్లాలో వరద విపత్తు నిర్వహణపై జిల్లా కలెక్టర్‌తో ఆయన మాట్లాడారు. విపత్తు సమయంలో ఎదుర్కొన్న అంశాలపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. కృష్ణానది వరద విపత్తును సమర్థంగా ఎదుర్కొన్నామని, బాపట్ల జిల్లా యంత్రాంగం చిత్తశుద్ధితో పని చేసిందని జిల్లా కలెక్టర్ వెంకట మురళి సిసోడియాకు వివరించారు. జిల్లాలో నిరాశ్రయులైన వేలాదిమందికి ఆశ్రయం కల్పించి, యుద్ధ ప్రాతిపదికన సహాయక చర్యలు చేపట్టామన్నారు. రూ 6.31 కోట్ల నిధులు ఖర్చు అయ్యాయని తెలిపారు. మిగిలిన రూ 69 లక్షలు ప్రభుత్వానికి పంపుతామన్నారు. కాల్వల గట్లు, చెరువు కట్టల బలోపేతానికి ప్రతిపాదనలు పంపామన్నారు. అత్యవసరం పరిస్థితుల నేపథ్యంలో పనులు చేపట్టడానికి సీఎం అనుమతుల మేరకు అధికారికంగా మంజూరు చేశామన్నారు. వాటికి తక్షణమే నిధులు ఇవ్వాలని కోరారు. స్పందించిన ఎండి సిసోడియ తక్షణమే నిధుల విడుదలకు చర్యలు తీసుకుంటామని చెప్పారు. ఈ సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి జి.గంగాధర్ గౌడ్, అగ్నిమాపక, విపత్తుల నిర్వహణ, నివారణ అధికారి మాధవ నాయుడు, ఉద్యానశాఖ అధికారిణి జె.జెనమ్మ, అనుబంధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

అర్జీలు స్వీకరిస్తున్న అధికారులు

రంగాయపాలెంలో రెవెన్యూ సదస్సు

ప్రజాశక్తి-కొత్తపట్నం

కొత్తపట్నం మండలం రంగాయపాలెం గ్రామ రెవెన్యూ సదస్సులో 34 అర్జీలు వచ్చినట్లు తహశీల్దార్ మధుసూదన్ రావు తెలియజేశారు. పలు అర్జీలను తక్షణమే పరిష్కరించినట్లు ఆయన తెలిపారు. గ్రామ రెవెన్యూ సదస్సులు బుధవారంతో ముగిశాయని మండల వ్యాప్తంగా వచ్చిన అర్జీలను పరిశీలించి సమస్యలు పరిష్కరిస్తామని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ మధుసూదన్ రావు, డీటీ కృష్ణమోహన్, ఆర్ఐ వర కుమార్, వీఆర్వోలు, సర్వేయర్లు, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఆపగలరా..పందెం.?

(మొదటిపేజీ తరువాయి)

ముడిపడిన కోడి పందాల విషయంలో నియంత్రణ సాధ్యమేనా అనేది చర్చనీయాంశం.

వందలాది పెంపకం కేంద్రాలు..

రేపల్లె నియోజకవర్గంలో పందెం కోళ్ల పెంపకం కేంద్రాలు దాదాపు 100కు పైనే ఉన్నాయి. ఒక్కొక్క ఫామ్‌లో 100 నుండి 150 కోళ్లకు ట్రైనింగ్ ఇస్తున్నారు. సంక్రాంతి సమీపిస్తుండటంతో నియోజకవర్గలో ఇప్పటికే 5 వేల కోళ్లకు పైనే పందేలకు రెడీ అవుతున్నట్లు సమాచారం. కొన్ని కేంద్రాల్లో స్పెషల్‌గా మేలు జాతి పందెం పుంజుల, పెట్టల నుండి గుడ్లను పొదిగించి ఆ పిల్లలను జాగ్రత్తగా పెంచుతున్నారు. ఆరు నెలల నుండి సంవత్సరం వయస్సు వచ్చే వరకు గుంపులుగా బయట పెంచి తర్వాత నుండి ఒక్కొక్క పందెం కోడిని విడివిడిగా పెంచుతారు. ఈ పందెం కోళ్లను పెంచడానికి విశాలమైన స్థలాలను లీజుకు తీసుకుంటారు. వాటి కోసం ప్రత్యేకంగా గాబులు, గ్రిల్స్ తో కూడిన బాక్సులు తయారు చేయిస్తారు.

కోడి పుంజు జాతిని బట్టి పందెం..

ముఖ్యంగా పందేలను ట్రైనింగ్ ఇచ్చే కోళ్ల జాతులు కూడా దాదాపుగా 90 జాతులు వరకు ఉన్నాయి. వీటిలో డేగ, కాకి, కాకిడేగ, నెమలి, కాకి నెమలి, నెమలి డేగ, ఎర్ర కొక్కిరాయి, నెమలి పింగళ, సీతువా, రసింగి, పచ్చ కాకి, అబ్రాస్,తెల్ల కొక్కిరాయి, పెట్టమారి, కోడి డేగ, నల్ల కొక్కిరాయి, డేగ పూల లాంటి పందెం కోళ్లు చాలా ముఖ్యమైనవి. ఈ జాతులను బట్టే పందెం రాయుళ్లు బెట్టింగులు కాస్తారు. అయితే ప్రస్తుత జనరేషన్ లో పెర్విన్ తూర్పు, పర్ల, మైల జాతులు ఎక్కువగా ఉపయోగిస్తున్నారు.

అధికార పార్టీలోకి క్యూ కట్టిన వైసిపి కౌన్సిలర్లు

(మొదటిపేజీ తరువాయి)

సూచించిన అజెండాలోని అంశాలు కొన్నింటిని ఆమోదించలేదు. టిడిపికి కొంత ఇబ్బందిగా అనిపించింది. ఈ నేపథ్యంలో కౌన్సిలర్లలో కొందరిని టిడిపిలోకి లాక్కోవాలని ఎమ్మెల్యే కందుల ప్లాన్ వేశారు. దీంతో ఏకంగా పది మందికి పైగా వైసిపి కౌన్సిలర్లు టిడిపిలోకి వచ్చేలా స్కెచ్ వేశారు. టిడిపిలోకి వచ్చే కౌన్సిలర్లకు తగిన ప్రాధాన్యత ఉంటుందని ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి హామీ ఇచ్చినట్లు తెలిసింది. కాంట్రాక్ట్ పనులు కొందరికి, ఉపాధి అవకాశాలు మరికొందరికి కల్పిస్తామని ఆశలు కల్పించారు. మున్సిపల్ చైర్మన్ చిర్లంచెర్ల బాలమురళీక్రిష్ణ మీద కూడా స్వపక్ష కౌన్సిలర్లు గుర్రుగా ఉన్నారు. వైసిపిని వీడేందుకు అదీ ఒక కారణంగా తెలిసింది. టిడిపి అధికారంలో ఉంది కదా... కొంతైనా లబ్ధి పొందవచ్చనే ఆలోచన మరికొందరిలో ఉంది. టిడిపి మాత్రం ప్రత్యర్థి వర్గాన్ని దెబ్బతీయడంతో పాటు మున్సిపల్ కౌన్సిల్‌లో బలం పెంచుకుంటుంది కదా.? అధికార పార్టీ పెత్తనం ఉంటుంది కదా.? ఏదిఏమైనా ఈ చేరికలు లాభం చేకూరుస్తాయని అధికార పార్టీ భావిస్తోంది.

వరిలో సస్యరక్షణ చర్యలు చేపట్టాలి

ప్రజాశక్తి-శింగరాయకొండ

శింగరాయకొండ మండలం సోమరాజుపల్లి, కలికివాయి గ్రామాలలో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి శింగరాయకొండ సబ్ డివిజన్ సహాయ వ్యవసాయ సంచాలకులు నిర్మల కుమారి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వరి పంటలో ఎరువులు యాజమాన్యం సమగ్ర సస్య రక్షణ చర్యల గురించి రైతుకు వివరించారు. మండల వ్యవసాయ అధికారి వి.సుధాకర్ మాట్లాడుతూ పిఎంఎఫ్‌బివై పథకం కింద పంటల బీమా గడువును వరి పంటకి జనవరి 15 వరకు పొడిగించినట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. పొలాలలో క్షేత్ర సందర్శన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారి జహీర్, సోమరాజుపల్లి గ్రామ వ్యవసాయ సహాయకులు ప్రియాంక, కలికివాయి గ్రామ వ్యవసాయ సహాయకులు శారద, సిఆర్‌పి ప్రకతి వ్యవసాయం వెంకటరమణ పాల్గొన్నారు.



టంగుటూరులో వరిని పరిశీలిస్తున్న అధికారులు

టంగుటూరు: మండలంలోని వల్లూరు, సురారెడ్డిపాలెం గ్రామాలలో సాగుచేసిన వరి పొలాలను వ్యవసాయాధి కారులు సందర్శించారు. ఈ సందర్భంగా ఏవో స్వర్ణలత మాట్లాడుతూ ప్రస్తుత వాతావరణ పరిస్థితులకు అగ్గి తెగులు వచ్చే అవకాశం ఉందన్నారు. దీని నివారణకు తీసుకోవాల్సిన చర్యలను వివరించారు. వర్షాల వలన శనగ పంట సాగు చేయడం ఆలస్యం అవుతున్న కారణంగా శనగ పంటకు తుప్పు తెగులు వచ్చే అవకాశం ఉందన్నారు. ప్రత్యామ్నాయంగా నువ్వులు, జొన్న పంటలను సాగు చేసుకోవాలని రైతులకు సూచించారు. ఈ కార్యక్రమంలో నాయకులు మొల కలపల్లి, కోటేశ్వర రావు, గ్రామ వ్యవసాయ శాఖ సాహాయ కులు జి.సౌమ్య, ఎంపీఈవో అజయ్, విస్తరణ అధికారి సి.హెచ్.యన్. శ్రీనివాస రావు, రైతులు పాల్గొన్నారు.

నాగులుప్పలపాడు: రైతులు రబీలో సాగు చేసిన పంటలకు ఈ-పంటలో తప్పని సరిగా చేయించుకోవాలని వ్యవసాయాధికారి పి.వెంకట్రావు తెలిపారు. బధవారం మండలం లోని తిమ్మసముద్రం గ్రామంలో వ్యవసాయ శాఖ మరియు అనుబంధ శాఖల అధికారుల ఆధ్వర్యంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి రైతు కూడా వేసిన పంటను ఈ పంటలో నమోదు చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో పశుసంవర్ధక శాఖ అధికారి అనురాధ, రైతులు పాల్గొన్నారు.

కొండపి: కొండపి మండలంలోని పెట్లూరు, మూగచింతల, చినకండ్లగుంట, తాటాకులపాలెం గ్రామాల్లో ఏవో డి.విజయ కుమార్ అధ్యక్షతన పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా వరి, కంది మరియు మిరప పంటలను పరిశీలించారు. మిరప పంట నందు పైముడత నివారణకు పిప్రోనిల్ 80 శాతం డబ్ల్యూజి 40 గ్రాములు, క్రింది ముడత నివారణకు డయాఫంతియురాన్ 50 డబ్ల్యూపి 300 గ్రాములు అదేవిధంగా కొమ్మ ఎండు మరియు కాయకుళ్ళు నివారణకు నాటివో 100గ్రాములు చొప్పున ఒక ఎకరా పొలంలో పిచికారి చేసుకోవాలని తెలియచేశారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారి తేజస్వి, గ్రామ వ్యవసాయ సహాయకులు పద్మ, వెంకట్రావు, రైతులు పాల్గొన్నారు.

కొండపిలో రైతులకు అవగాహన కల్పిస్తున్న అధికారులు

బీసీ కార్పొరేషన్ రుణాలకు దరఖాస్తులు

ప్రజాశక్తి-నాగులుప్పలపాడు

బీసీ కార్పోరేషన్ రుణాలకు దరఖాస్తులు కోరుతున్నట్లు ఎంపీడీవో వై.మహాలక్ష్మి తెలిపారు. రుణాలు తీసుకోవాల నుకునే ఆయా సామాజిక వర్గాలకు చెందిన వారు ఈనెల 8 నుంచి 16 వరకు సచివాలయాల్లోని డిజిటల్ మరియు వెల్ఫేర్ అసిస్టెంట్ల సహాయంతో కార్యదర్శులను సంప్రదించి దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు.

కాచి చల్లార్చిన నీటిని తాగాలి

ప్రజాశక్తి- బాపట్ల: బాపట్ల పట్టణానికి నీరు సరఫరా అయ్యే ప్రధాన పైపు లైన్లుకు అనుసంధాన పైప్ లైన్లు పనులు నిర్వహిస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ రఘునాధ రెడ్డి బుధవారం తెలిపారు. ఆయా పైపుల ద్వారా సరఫరా అయ్యే నీరు సరఫరా రంగు మారనున్న దష్ట్యా రెండు రోజులపాటు నీటిని కాచి చల్లార్చుకొని తాగాలని కమిషనర్ రఘునాథ్ రెడ్డి తెలిపారు.

కోరం లేక మండల సమావేశం వాయిదా

ప్రజాశక్తి - కర్లపాలెం

కోరం లేక పోవడంతో మండల పరిషత్ సర్వసభ్య సమావేశం వాయిదా పడింది. మంగళవారం మండల సర్వసభ్య సమావేశం నిర్వహించాలని నిర్ణయించారు. అయితే ఎంపీటీసీలు సమావేశానికి హాజరు కాకపోవడంఓత ఎంపిడిఒ అద్దూరి శ్రీనివాసరావు బుధవారానికి వాయిదా వేశారు. బుధవారం కూడా ఎంపిపి, ,ఎంపీటీసీలు గైర్హాజరు కావడంతో వాయిదా వేస్తున్నట్లు ఎంపిడిఒ ప్రకటించారు.

జూదరులు అరెస్టు

ప్రజాశక్తి - నిజాంపట్నం

నిజాంపట్నం పోలీస్ స్టేషన్ పరిధిలోని కల్లిఫలం గ్రామ శివారులోని మడ అడవుల్లో ఎస్ఐ కందుల తిరుపతిరావు తన సిబ్బందితో కలిసి కోడిపందేల శిబిరంపై మెరుపు దాడులు నిర్వహించారు. నలుగురు జూదరులను అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి రెండు కోడి పుంజులు రూ.10,870 నగదును స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ తెలిపారు. ఈ దాడుల్లో పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

నివాళులర్పిస్తున్న నేతలు

సత్యనారాయణరెడ్డి మృతి పట్ల సంతాపం

ప్రజాశక్తి-కొత్తపట్నం

కొత్తపట్నం గ్రామంలో కుంతూరి సత్యనారాయణ రెడ్డి మృతదేహానికి వైసీపీ ఒంగోలు ఇన్‌ఛార్జి చుండూరి రవి, కొత్తపట్నం ఎంపీపీ లంకపోతు అంజిరెడ్డి, వైసీపీ నాయకులు వీఆర్సీ రెడ్డి తదితరులు నివాళులర్పించి వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని ప్రకటించారు. సత్యనారాయణ రెడ్డి(80) కొంతకాలంగా వయోభారంతో బాధపడుతూ మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. అలాగే సిపిఎం జిల్లా నాయకులు కొండారెడ్డి, సోమిరెడ్డి, పట్టపు ప్రకాశం నివాళులర్పించి వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.

అధికారులు స్వాధీనం చేసుకున్న నాటుసారా

బెల్లం ఊట ధ్వంసం

ప్రజాశక్తి-నిజాంపట్నం

నిజాంపట్నం మండలంలోని అదవల పరిసర ప్రాంతాలలో నాటు సారా కాస్తున్నారని వచ్చిన సమాచారం మేరకు, నగరం ప్రొహిబిషన్ మరియు ఎక్సైజ్ సీఐ మార్తర్తి శ్రీరామ్ ప్రసాద్ బుధవారం దాడులు నిర్వహించి 250 లీటర్ల బెల్లం ఊటను ధ్వంసం చేశారు. నాటు సారా తయారీ కోసం ఏర్పాటు చేసిన ఒక నాటు సారా బట్టీని ధ్వంసం చేశారు. ఈ సందర్భంగా సిఐ మాట్లాడుతూ నాటు సారా కాచినా, అమ్మినా కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ఈ ప్రాంతంలో నిరంతర నిఘా ఉంటుందన్నారు. నాటు సారా తయారీ గురించి తెలిస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. ఈ దాడులలో కానిస్టేబుల్ శ్రీనివాసరెడ్డి, మధుసూదన్ రావు, శ్రీనివాసరెడ్డి స్టేషన్ డ్రైవర్ పాల్గొన్నారు.

పోలీసులు స్వాధీనం చేసుకున్న మద్యం బాటిళ్లు

మద్యం బాటిళ్లు స్వాధీనం

ప్రజాశక్తి-వేటపాలెం

మండల పరిధిలోని కటారిపాలెంలో అక్రమంగా మద్యం కలిగి ఉన్న వ్యక్తిని పోలీసులు బుధవారం అరెస్టు చేసి 265 మద్యం బాటిళ్లను, 25 బీరు సీసాలు స్వాధీనం చేసుకున్నారు. దంతంపేట గ్రామానికి చెందిన బొడ్డు నాగ శంకర్ కటారిపాలెం గ్రామంలో గోనె సంచితో సంచరిస్తూ ఉన్నాడు. పోలీసులను చూసి పరుగు లఘించుకోగా అనుమానంతో పోలీసులు వెంబడించి పట్టుకున్నారు. నిందితుడు నాగ శంకర్‌ని విచారించి మద్యం సీసాలు నిల్వ ఉంచిన ప్రదేశానికి చేరుకున్నారు. మద్యం సీసాలను స్వాధీనం చేసుకొని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. అరెస్టు చేసిన బొడ్డు నాగ శంకర్‌ను కోర్టుకు హాజర పర్చనున్నట్లు వేటపాలెం ఎస్ఐ మీసాల వెంకటేశ్వర్లు తెలిపారు.

పొగాకు బ్యారెన్ దగ్ధం

రూ.10 లక్షలు నష్టం

ప్రజాశక్తి-చీమకుర్తి

మండలంలోని కేవీ పాలెంలో బుధవారం రాత్రి జరిగిన పొగాకు బారన్ దగ్ధం అయిన ప్రమాదంలో రూ.10 లక్షలు నష్టం జరిగింది. అందిన వివరాల ప్రకారం.. కె.వి పాలెంనకు చెందిన సోమినేని సుబ్బారావు పొగాకు బారన్‌లో క్యూరింగ్ జరుగుతుండగా బుధవారం రాత్రి సమయంలో గొట్టంపై కర్ర పడటంతో మంటలు చెలరేగి లోపల మొత్తం కాలిపోయింది. అగ్నిమాపక సిబ్బంది వచ్చి మంటలు ఆర్పారు. ఈ సంఘటనలో దాదాపు రూ.10 లక్షలు నష్టం వాటిల్లినట్లు సోమినేని సుబ్బారావు తెలిపారు.

దగ్ధమవుతున్న బ్యారెన్

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

డి3 సెక్షన్ పరిధిలో గురువారం మధ్యాహ్నం 12 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు పేర్నమిట్ట దగ్గర రాజీవ్ నగర్, మీరాకాలనీ, లింగారెడ్డి కాలనీ తదితర ప్రాంతాలలో విద్యుత్ మరమ్మతుల కారణం వల్ల విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని ఒంగోలు టౌన్ డీఈఈ కెవి పాండురంగారావు తెలిపారు. కావున విద్యుత్ వినియోగదారులు గమనించి సహకరించాలని కోరారు.

సొంత నిధులతో..

రహదారికి మరమ్మతులు

ప్రజాశక్తి-టంగుటూరు

ఎవరో వస్తారని.. ఏదో చేస్తారని ఎదురు చూడకుండా, ప్రభుత్వాలపై ఆధారపడకుండా రైతులంతా ఒక్కటై పంట పొలాలకు వెళ్లే రహదారిని బాగు చేసుకున్నారు. ఈ సంఘటన జరుగుమల్లి మండలంలోని దావగూడూరు గ్రామంలో జరిగింది. దావగూడూరులో రైతులు తమ పంట పొలాలకు వెళ్లే రోడ్డు మరమ్మతులకు గురైంది. మోకాలు లోతు గుంతలతో రాక పోకలకు అంతరాయం ఏర్పడింది. వ్యవసాయ సీజన్‌లో ట్రాక్టర్‌పై వెళ్లాలంటే పెద్ద సాహసమే చేయాల్సి వచ్చేది. మోకాళ్ల లోతు గుంతలతో రైతుల అవస్థలు వర్ణనాతీతం. పొగాకు సీజను మొక్కలు వేసేటప్పటి నుంచి, పచ్చాకు కొట్టుడు వరకు, శనగ పంట సాగు చేసే రైతులకు చెప్పనలవి కాని బాధలు. ఈ నేపథ్యంలో ప్రభుత్వంపై ఆధార పడకుండా రోడ్డు మరమ్మతులు చేయాలనుకున్నారు. అనుకున్నదే తడవుగా చందాలు వేసుకొని నిధులు సమకూర్చుకొని యంత్రాల సహాయంతో రహదారి మరమ్మతులు చేపట్టారు. తమ రోడ్డుని తామే బాగు చేసుకున్నారు.

మట్టి చదును చేస్తున్న దృశ్యం

మహాధర్నాను జయప్రదం చేయాలి

ప్రజాశక్తి-కొండపి

అర్హులైన పేదలకు ఇళ్ల స్థలాలు మంజూరు చేయాలని కోరుతూ ఈనెల 10వ తేదీన సిపిఐ ఆధ్వర్యంలో ఒంగోలు కలెక్టర్ కార్యాలయం ఎదుట జరుగుతున్న మహాధర్నాలో ప్రజలు పాల్గొనాలని జయప్రదం చేయాలని సిపిఐ నియోజకవర్గ కార్యదర్శి కె.వీరారెడ్డి పిలుపునిచ్చారు. బుధవారం ముప్పవరం గ్రామంలోని ఇల్లు లేని పేదలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వీరారెడ్డి మాట్లాడుతూ గత ప్రభుత్వం ప్రజల సంక్షేమం పక్కన పెట్టి కార్పొరేట్ కంపెనీలకు రాయితీలు, పేదల నెత్తిన భారాలు మోపి ఇబ్బందులు పెట్టిందన్నారు. అందుకే రాష్ట్ర ప్రజలు సరైన సమాధానం చెప్పారని తెలిపారు. ప్రస్తుతం అధికారంలోకి వచ్చిన ఎన్‌డిఏ కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాకముందు ఒక మాట వచ్చినాక ఒక మాట మాట్లాడుతుందని విమర్శించారు. పేదలు సొంత ఇల్లు లేక ఇబ్బందులు పడుతున్నారని, సీపీఐ ఆధ్వర్యంలో అర్హులైన అందరికీ ఇళ్ల స్థలాలు ఇవ్వాలని ఒంగోలు కలెక్టర్ ఆఫీస్ వద్ద జనవరి 10తేదీ జరిగే మహాధర్నాను జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఐ కొండేపి మండల కార్యదర్శి ఆర్.లక్ష్మి, రమణ, రసూల్ బి, ఈశ్వరమ్మ, శ్రీను, కమల, సుజాత తదితరులు పాల్గొన్నారు.

చేనేత సొసైటీ మాజీ చైర్మన్ ఆంజనేయులు మృతి

ప్రజాశక్తి-చీమకుర్తి

చీమకుర్తి చేనేత సొసైటీ మాజీ చైర్మన్ శీలం ఆంజనేయులు (72) మృతి చెందారు. ఆయన గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతూ మంగళవారం మృతి చెందగా బుధవారం అంత్యక్రియలు నిర్వహించారు. జడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, మద్దిపాడు ఏఎంసీ మాజీ చైర్మన్ మారం వెంకారెడ్డి, వైసీపీ మండల అధ్యక్షుడు పమిడి వెంకటేశ్వర్లు, కౌన్సిలర్లు సోమ శేషాద్రి, ఆముదాలపల్లి రాంబ్రహ్మం, తప్పెట బాబురావు, శీలం శివకృష్ణ, మాజీ మున్సిపల్ చైర్మన్ కె.రాఘవరావు, వైస్ చైర్మన్ కందిమల్ల గంగాధర్ రావు, జిల్లా చేనేత అధికారి అనుముల వెంకటేశ్వర్లు తదితరులు ఆంజనేయులుకు నివాళులర్పించి కుటుంబ సభ్యులను పరామర్శించారు.

నివాళులర్పిస్తున్న జడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ

గుండెపోటుతో టీడీపీ నాయకుడు కిరణ్ మృతి

ప్రజాశక్తి-టంగుటూరు

జరుగుమల్లి మండలంలోని కె.బిట్రగుంట గ్రామానికి చెందిన యర్రా కిరణ్ (45) బుధవారం గుండె పోటుతో మృతి చెందారు. కిరణ్ ఒంగోలులోని తన నివాసంలో మందులు తీసుకు రావడానికి బయటకు వచ్చి వెంటనే కింద పడిపోయారు. ప్రథమ చికిత్స కోసం ఒంగోలులో వైద్యశాలకు తరలించారు. అప్పటికే కిరణ్ మృతి చెందారని వైద్యులు చెప్పారు. కిరణ్ బాబాయి, అక్కలు అమెరికా నుంచి రావాల్సి ఉంది. కిరణ్ భౌతిక దేహాన్ని ఒంగోలులోని సంఘమిత్రలో భద్రపరిచారు. కిరణ్‌కి భార్య కళ్యాణి, కుమార్తె, కుమారుడు ఉన్నారు. జరుగుమల్లి మండలంలోని కె.బిట్రగుంట గ్రామంలో టీడీపీలో చురుగ్గా పనిచేస్తున్నారు. కిరణ్ మృతిపట్ల పలువురు సంతాపం తెలియజేశారు.

సందడిగా ఆటల పోటీలు

ప్రజాశక్తి-మద్దిపాడు

మద్దిపాడులోని ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో సంక్రాంతి సంబరాలలో భాగంగా ఉద్యోగులకు ఎంపీడీవో జ్యోతి ఆధ్వర్యంలో బుధవారం ఆటలు పోటీలు నిర్వహించారు. ఆహ్లాదకర వాతావరణంలో పోటీలు జరగ్గా ఉద్యోగులందరూ పోటీలలో ఉత్సాహంగా పాల్గొన్నారు. నిత్యం ఉద్యోగ బాధ్యతలు భాగంగా బిజీగా ఉండే తాము ఈ ఒక్కరోజు తోటి ఉద్యోగుల అందరితో కలిసి ఆటల పోటీలలో పాల్గొనటం ఆనందంగా ఉందన్నారు. ఈ పోటీలు నిర్వహించిన ఎంపీడీవో జ్యోతికి ఉద్యోగులు కృతజ్ఞతలు తెలిపారు. వివిధ పోటీల్లో గెలుపొందిన ఉద్యోగులకు ఎంపీపీ వాక అరుణ కోటిరెడ్డి చేతుల మీదుగా బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు, ఎంపీడీవో కార్యాలయం సిబ్బంది, ఉద్యోగులు పాల్గొన్నారు.

హద్దుల ఏర్పాటుకు చర్యలు

ప్రజాశక్తి -పంగులూరు

మండల పరిధిలోని భగవాన్ రాజుపాలెం గ్రామం వద్ద 16వ నెంబర్ జాతీయ రహదారికి ఇరువైపులా డ్రైనేజీ ఏర్పాటులో భాగంగా హైవే అధికారులు, రెవెన్యూ అధికారులు హద్దుల ఏర్పాటుకు చర్యలు చేపట్టారు. రోడ్డు విస్తరణ సమయంలో హైవేపై డ్రైనేజీ ఏర్పాటు లేదు. దీంతో రోడ్డుకు ఇరువైపులా నివాస గృహాల వద్ద వర్షపు నీటి, మురుగునీరు కూడా రోజుల తరబడి నిల్వ ఉండటంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. సమస్యలను ఇటీవల రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ దృష్టికి తీసుకువెళ్లారు. స్పందించిన మంత్రి సమస్య పరిష్కారానికి వెంటనే తగు చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. అందులో భాగంగా రహదారికి ఇరువైపులా డ్రైనేజీ ఏర్పాటుకు తహశీల్దార్ పి.సింగారావు, హైవే అధికారులు బుధవారం సర్వే నిర్వహించారు.

పురుగు మందు తాగి వ్యక్తి ఆత్మహత్య

అర్ధవీడు- ప్రజాశక్తి

పురుగుల మందు తాగి వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న సంఘటన బుధవారం అర్ధవీడు మండలంలోని బొమ్మిలింగం గ్రామంలో చోటుచేసుకుంది. బొమ్మిలింగం గ్రామానికి చెందిన యేసు రాజు నాయక్ (45) కొంత కాలంగా కడుపు నొప్పితో బాధపడుతున్నాడు. ఇంట్లో ఎవరూ లేని సమయంలో పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈయనకు ఇద్దరు పిల్లలు ఉన్నారు. సమాచారం అందుకున్న అర్ధవీడు పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. మృతికి గల పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

ప్రమాదవశాత్తూ లారీ డ్రైవర్ మృతి

ప్రజాశక్తి - రేపల్లె

లారీని శుభ్రం చేస్తూ ప్రమాదవశాత్తూ ముందుకు పడిపోయి డ్రైవర్ మతి చెందిన సంఘటన రేపల్లె మండలం పెనుమూడి చెక్ పోస్ట్ వద్ద జరిగింది. కృష్ణా జిల్లా కోడూరు మండలం రామకష్టాపురం గ్రామానికి చెందిన అద్దంకి ప్రభుదాసు (45) బుధవారం లారీని పక్కన ఆపి శుభ్రం చేస్తుండగా ముందుకు పడిపోయాడు. గమనించిన స్థానికులు రేపల్లె ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకువెళ్లగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. మృతుని సోదరుడు పాండురంగారావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్ఐ రాజశేఖర్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మృతి చెందిన ప్రభుదాసు

నిందితుడిని అరెస్టు చేసిన పోలీసులు

హత్య కేసులో నిందితుడు అరెస్టు

ప్రజాశక్తి - నగరం

నగరం మండలం చిన్నమట్లపూడి గ్రామంలో జరిగిన హత్య కేసులో నిందితుడిని పోలీసులు అరెస్టు చేశారు. బుధవారం పోలీసులు వివరాలు వెల్లడించారు. చిన్నమట్లపూడి గ్రామానికి భాస్కరుని వెంకట సాంబశివరావు అలియాస్ సాంబయ్య అలియాస్ పొన్నూరు సాంబయ్యను గ్రామంలోని అతని ఇంటి వద్ద ఉండగా పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. అతని వద్ద నుంచి హత్య చేయడానికి ఉపయోగించిన ఆయుధాన్ని స్వాధీనం చేసుకున్నారు. రేపల్లె కోర్టులో హాజరు పరచగా నిందితుడికి 14 రోజులు రిమాండ్ విధించినట్లు పోలీసులు తెలిపారు.

మంటలను ఆర్పుతున్న అగ్నిమాపక సిబ్బంది

చందలూరులో అగ్ని ప్రమాదం

ప్రజాశక్తి - పంగులూరు

పంగులూరు మండలం చందలూరు గ్రామంలో బుధవారం మధ్యాహ్నం జరిగిన అగ్ని ప్రమాదంలో ఐదు లక్షల రూపాయలు విలువచేసే రెస్టారెంట్ సామాను దగ్ధమైంది. గ్రామానికి చివరన ఉన్న ఒక గదిలో రెస్టారెంట్ సామాన్లను చందలూరు గ్రామానికి చెందిన పెంట్యాల రామాంజనేయ స్వామి ఉంచారు. అయితే ప్రమాదవశాత్తు అగ్ని ప్రమాదం జరిగినట్లు అద్దంకి ఫైర్ స్టేషన్ అధికారులు తెలిపారు. సమాచారం అందిన వెంటనే అద్దంకి నుంచి ఫైర్ ఇంజన్ వచ్చి మంటలు ఆర్పింది. ఈ ప్రమాదంలో ఐదు లక్షల రూపాయలు విలువచేసే రెస్టారెంట్ సామాను దగ్ధమైనట్లు యజమాని పెంట్యాల రామాంజనేయ స్వామి తెలిపారు.

దాతలు అందజేసిన బెంచీలు

పాఠశాలకు బెంచీలు బహూకరణ

ప్రజాశక్తి- యద్దనపూడి

మండల పరిధిలోని అనంతవరం కొల్లా వీరవసంతరావు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు వింజనంపాడుకు గ్రామానికి చెందిన ప్రవాస భారతీయుడు తుమాటి కిషోర్ ఆర్థిక సాయంతో రూ.1.65 లక్షల విలువైన బెంచీలు బుధవారం బహూకరించారు. ఈ సందర్భంగా దాత కిషోర్ తల్లి రాజరాజేశ్వరి , సోదరులు శ్రీనివాసు, బాలకష్ణను ఉపాధ్యాయులు సన్మానించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు రాఘవరెడ్డి, ఎస్ఎంసి చైర్మన్ రమాజ్యోతి, పూర్వ విద్యార్థుల సంఘం అధ్యక్షుడు తుర్లపాటి శ్రీనివాస్, పూర్వ విద్యార్థులు పెదవల్లి రమేష్, మండవ నరేంద్ర ,కొత్తపల్లి రాఘవ, గ్రామస్తులు మురకొండ రోశయ్య, రావి రత్తయ్య , ఎం. వీరయ్య, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ డిఇకి వినతి

ప్రజాశక్తి- అద్దంకి

2025-2026 ఆర్థిక సంవత్సరానికి విద్యుత్ డిఐఎస్‌సిఒఎంలు సమర్పించిన ఎఆర్ఆర్ మరియు ప్రతిపాదనలపై అభ్యంతరాలు తెలుపుతూ సిపిఎం, సిపిఐ ఆధ్వర్యంలో మంగళ, బుధవారాల్లో ప్రజాభిప్రాయం సేకరణ చేపట్టారు. అందులో భాగంగా విద్యుతథ్ డిఇని కలిసి వినతి పత్రం అందించారు. ప్రజలపై అధిక కరెంటు చార్జీలు వేసి భారాలకు గురి చేయటాన్ని వామపక్ష పార్టీల తరపున వ్యతిరేకిస్తున్నట్లు తెలియజేశారు ఈ కార్యక్రమంలో సిపిఐ నాయకుడు కెఎల్‌డి.ప్రసాదరావు, సిపిఎం నాయకుడు తంగిరాల వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

జడ్‌పి సిఇఒకు సన్మానం

ప్రజాశక్తి- భట్టిప్రోలు

ఉమ్మడి గుంటూరు జిల్లా పరిషత్ సిఇఒ జ్యోతిబసును జడ్‌పిటిసి తిరువీధుల ఉదయ భాస్కరి బాలాజీ శాలువాతో సన్మానించారు. జ్యోతిబసు రికార్డుల పరిశీలన నిమిత్తం బుధవారం భట్టిప్రోలు వచ్చారు. ఈ సందర్భంగా జడ్‌పిటిసి ఉదయ భాస్కరి జడ్‌పి సిఇఒ జ్యోతి బసును కలిసి సన్మానించారు. ఈ సందర్భంగా వివిధ అంశాలపై చర్చించారు.

12న ఉచిత వైద్యశిబిరం

ప్రజాశక్తి-ఇంకొల్లు

ఇంకొల్లు మండలం గంగవరం గ్రామంలోని పంచాల వెంకట్రామయ్య, రంగమ్మ విద్యా వైజ్ఞానిక కల్యాణ మండపంలో ఈనెల 12న రెగ్యులర్ మెడికల్ క్యాంపు నిర్వహిస్తున్నట్లు కన్వీనర్ కె.బాలచంద్ర తెలిపారు . గత ఆరు సంవత్సరాలుగా క్రమం తప్పకుండా ప్రతి రెండు నెలలకు ఒకసారి వైద్యశిరం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ వైద్య శిబిరంలో షుగర్ వైద్యనిపుణులు డాక్టర్ మంచాల రమేష్ బాబు, డాక్టర్ ఎ.సాంబశివరావు, జనరల్ వైద్యులు ఆదిత్య వర్ధన్ వైద్యసేవలు అందిస్తారని తెలిపారు. షుగర్, బిపి పరీక్షలు ఉచితంగా నిర్వహించి మందులు అందజేయనున్నట్లు తెలిపారు. ఈ మెడికల్ క్యాంపుకు మద్దాలి రంగబాబు, వాణి దంపతులు ఆర్థిక సాయం అందించినట్లు బాలచంద్ర తెలిపారు. ఇంకొల్లు పరిసర గ్రామాలలో ప్రజలు వైద్యశిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

ముప్పవరంలో నేత్రదానం

ప్రజాశక్తి - పంగులూరు

మండల పరిధిలోని ముప్పవరం గ్రామానికి చెందిన దూళిపాళ్ల నాగరత్నమ్మ (90) మంగళవారం మతి చెందింది. ఆమె నేత్రాలను కుటుంబ సభ్యులు దానం చేశారు. రోటరీ క్లబ్ ఆఫ్ పంగులూరు సభ్యులు గరిమిడి జగన్‌మోహన్‌రావు ఆధ్వర్యంలో గుంటూరు శంకర్ కంటి ఆసుపత్రి వైద్యులు నాగరత్నమ్మ కార్నియాలను సేకరించారు. ఈ కార్యక్రమంలో నాగరత్నమ్మ కుమారులు ధూళిపాళ్ల భావన్నారాయణ, ధూళిపాళ్ల సత్యనారాయణ, రోటరీ క్లబ్ సెక్రెటరీ బత్తుల వీరనారాయణ, రోటరీ క్యాంప్ చైర్మన్ చిలుకూరి వీరరాఘవయ్య పాల్గొనానరు. నేత్రదానం చేసేందుకు ముందుకొచ్చిన ధూళిపాళ్ల భావన్నారాయణను రోటరీ సభ్యులు అభినందించారు.

సంక్రాంతి క్రికెట్ కప్ పోటీలు ప్రారంభం

తొలి మ్యాచ్‌లో గుంటూరు జట్టు విజయం

ప్రజాశక్తి- మేదరమెట్ల

మండల పరిధిలోని రావినూతల గ్రామంలో రావినూతల స్పోర్ట్స్ అండ్ కల్చరల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో భ్రమరా టౌన్‌షిప్ వారి ఆర్థికసహకారంతో 31వ అంతర్‌రాష్ట్ర సంక్రాంతి కప్ క్రికెట్ పోటీలు బుధవారం అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ పర్యాటక అభివద్ధి సంస్థ చైర్మన్ నూకసాని బాలాజీ మాట్లాడుతూ గ్రామస్తులు అసోసియేషన్‌గా ఏర్పడి స్టేడియాన్ని నిర్మించుకొని క్రికెట్ పోటీలు నిర్వహించడం అభినందనీయమని తెలిపారు. ఇలాంటి గ్రామాలు, ఇలాంటి వ్యక్తులు అరుదుగా కనిపిస్తారని తెలిపారు. మా ఆర్టిస్ట్ అసోసియేషన్ జనరల్ సెక్రెటరీ రఘు బాబు మాట్లాడుతూ తమ గ్రామంలో ఇంతటి స్టేడియం ఉండటంతో సంతోషంగా ఉందన్నారు. విజేతలకు

క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న నూకసాని బాలాజీ

రూ.1116 నుంచి ఆరు లక్షల ప్రైజ్ ఇచ్చే వరకూ ఎదగటం, వివిధ రాష్ట్రాల నుంచి క్రీడాకారులు ఇచ్చి ఇక్కడ ఆడటం ఎంతో గర్వంగా ఉందన్నారు. తొలుత శ్రీ భ్రమరా టౌన్షిప్ మేనేజింగ్ డైరెక్టర్ గళ్ళ రామచంద్ర రావు జ్యోతి ప్రజ్వలన చేశారు. అనంతరం క్రీడా కారులను పరిచయం చేసుకున్నారు. నూకసాని బాలాజీ ,గళ్ళ రామచంద్రరావు, సినీ నటుడు ఎర్ర రఘుబాబు కొద్ది సేపు బ్యాటింగ్ చేసి సందడి చేశారు. ఈ కార్యక్రమంలో బాధర బాడ్మింటన్ సమాఖ్య మాజీ కార్యదర్శి, గ్రామవాసి మువ్వా తిలక్, అద్దంకి రూరల్ సిఐ డి. మల్లికార్జునరావు, మస్తాన్‌రావు, చిన్నపాటి హరిబాబు, మేదరమెట్ల శ్రీనివాసరావు, అసోసియేషన్ సభ్యులు చేబ్రోలు నరసింహా రావు, శ్రీనివాస రావు, ఆర్ఎస్‌సిఎ అధ్యక్షుడు కారుసాల నాగేశ్వరరావు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

గుంటూరు జట్టు బోణి

సంక్రాంతి కప్ టోర్నమెంట్‌లో భాగంగా తొలి మ్యాచ్ ఎస్‌పిఎఆర్ఎ టిఎఎన్‌వారియర్ 11 తిరుపతి వర్సెస్ జిడిసిఎ గుంటూరు జట్లు తలపడ్డాయి. టాస్ గెలిచిన గుంటూరు జట్టు తొలుత ఫీల్డింగ్ ఎంచుకుని తిరుపతి జట్టును బ్యాటింగ్ ఆహ్వానించింది .తిరుపతి జట్టు నిర్ణీత 20 ఓవర్లలో 168 పరుగులను చేసి తొమ్మిది వికెట్లను కోల్పోయింది. అనంతరం బ్యాటింగ్ చేపట్టిన గుంటూరు జట్టు 19.2 ఓవర్లలో ఆరు వికెట్లు కోల్పోయి 169 పరుగులు చేసి నాలుగు వికెట్ల తేడాతో విజయం

బ్యాటింగ్ చేస్తున్న సినీనటుడు రఘుబాబు

సాధించింది. గుంటూరు జట్టు క్రీడా కారుడడు 42 బంతులు ఆడి 2 సిక్సలు, 2 ఫోర్లతో మహిదీప్ 49 పరుగులు సాధించాడు. కెపి.సాయి రాహుల్ కేవలం 18 బంతుల్లో 2 సిక్సలతో 2 ఫోర్లతో 32 పరుగులు సాధించి జట్టు విజయాన్ని ఖరారు చేసాడు. రాహుల్ బౌలింగ్ లో కూడా రాణించి నాలుగు ఓవర్లలో 41 పరుగు ఇచ్చి 3 వికెట్లు పడగొట్టాడు. తిరుపతి జట్టుకు చెందిన వాట్సన్ 3.2 ఓవర్లలో 36 పరుగులు ఇచ్చి మూడు వికెట్లను పడగొట్టాడు . ఈ మ్యాచ్‌కు ఎంపైర్లుగా శ్రీనివాసరావు ,రాజు వ్యవహరించారు.

నేటి మ్యాచ్‌లు ఇవే..

నెక్స్ట్ గెన్ లెవెన్ హైదరాబాద్ వర్సెస్ మస్తాన్ లెవెన్ మార్టూరు జట్ల మధ్య తొలిమ్యాచ్ జరగనుంది. రెండో ఎంఆర్‌సిసి 11 చెన్నై వర్సెస్ సికింద్రాబాద్ రైల్వే జట్ల మధ్య జరగనుంది.

ధాన్యాన్ని ప్రభుత్వమే కొనుగోలు చేయాలి

సిపిఎం బాపట్ల జిల్లా కార్యదర్శి సిహెచ్. గంగయ్య.

ప్రజాశక్తి - పంగులూరు

కొనుగోలు కేంద్రాలు ద్వారా ప్రభుత్వమే రైతుల వద్ద నుంచి ధాన్యాన్ని కొనుగోలు చేయాలని సిపిఎం బాపట్ల జిల్లా కార్యదర్శి సిహెచ్.గంగయ్య డిమాండ్ చేశారు. సిపిఎం మండల కమిటీ సమావేశం బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా గంగయ్య మాట్లాడుతూ పంగులూరు మండలం రామకూరు గ్రామంలో రైతులు సుమారు 400 ఎకరాల్లో మాగాణి సాగు చేశారన్నారు. ప్రస్తుతం ధాన్యం నూర్పిడి జరుగుతుందన్నారు. ఈ పరిస్థితుల్లో ప్రభుత్వం కొనుగోలు కేంద్రాల ద్వారా ధాన్యాన్ని కొనుగోలు చేయాలన్నారు. ప్రైవేటు వ్యాపారులు రైతుల అవసరాలను గుర్తించి తక్కువ ధరకే ధాన్యం కొనుగోలు చేస్తున్నట్లు తెలిపారు. బస్తా రూ.1400 అడుగుతున్నట్లు తెలిపారు. ప్రభుత్వం బస్తా రూ.1740 కొనుగోలు చేస్తామని ప్రకటించినట్లు తెలిపారు. ప్రస్తుతం పెట్టుబడులు, ఖర్చులు పెరిగినట్లు తెలిపారు. ఈ నేథ్యంలో బస్తా రూ. 1740 రూపాయలకు అమ్మితేనే రైతుకు గిట్టుబాటు అవుతుందన్నారు. ప్రైవేట్ వ్యాపారులు రూ.1400కొనుగోలు చేయటం వల్ల రైతులు భారీగా నష్టపోయే అవకాశం ఉందన్నారు. రామకూరు గ్రామంలో పండిన ధాన్యాన్ని కొనుగోలు చేస్తామని గత 15 రోజులుగా అధికారులు చెబుతున్నట్లు తెలిపారు. అయితే ఇప్పటి వరకూ ఒక గింజ కూడా కొనుగోలు చేయలేదన్నారు. జిల్లాలో కొన్నిచోట్ల ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించాల్సి ఉందన్నారు. రైతుల ఇబ్బందులను దష్టిలో ఉంచుకొని తక్షణమే కొనుగోలు కేంద్రాలను ప్రారంభించాలన్నారు. రైతులు వద్ద ఉన్న ధాన్యాన్ని కొనుగోలు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా నాయకులు తలపనేని రామారావు, రాయిని వినోద్ బాబు, మండల కమిటీ సభ్యులు ఎం. హరిబాబు, నాయపాము ప్రభాకర్, పూసపాటి సుబ్బరాజు, పాలపర్తి ఏలియా పాల్గొన్నారు.

మాట్లాడుతున్న సిపిఎం బాపట్ల జిల్లా కార్యదర్శి గంగయ్య

10 నుంచి కార్మికుల రిలే నిరాహార దీక్షలు

ప్రజాశక్తి-బాపట్ల

మున్సిపల్ కార్మికులకు ఇచ్చిన సమ్మె ఒప్పందాలను అమలు చేయాలని కోరుతూ ఈనెల 10 నుంచి రాష్ట్రవ్యాప్తంగా పురపాలక సంఘ కార్యాలయాల వద్ద రిలే నిరాహార దీక్షలు నిర్వహిస్తున్నట్లు బాపట్ల జిల్లా మున్సిపల్ ఇంజినీరింగ్ వర్కర్స్ జిల్లా కన్వీనర్ చిమటా వీరస్వామి తెలిపారు. స్తానిక పుచ్చలపల్లి సుందరయ్య ప్రజాసంఘాల కార్యాలయంలో బుధవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వీరాస్వామి మాట్లాడుతూ గతంలో సమ్మె సందర్భంగా ప్రభుత్వంతో కుదిరిన ఒప్పందం మేరకు కార్మికులకు వేతనాలు పెంచాలన్నారు. రిటైర్మెంట్ వయస్సు 62 ఏళ్లకు పెంచి జీవో ఇవ్వాలన్నారు. మట్టి ఖర్చులకు ఇస్తున్న మొత్తాన్ని రూ 20 వేలకు పెంచాలని, రిటైర్మెంట్ బెనిఫిట్స్ పెంచి అమలు చేయాలని కోరుతూ రిలే నిరాహార దీక్షలు చేపడుతున్నట్లు ఆయన తెలిపారు. సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి సిహెచ్. మజుందర్ మాట్లాడుతూ పట్టణాలను పరిశుభ్రంగా ఉంచడం,

మాట్లాడుతున్న చిమటా వీరాస్వామి

ప్రజలకు సేవలు అందించడంలో మున్సిపల్ కార్మికులు ఎనలేని సేవ చేస్తున్నారనన్నారు. మున్సిపల్ కార్మికులకు వేతనాల్లో వ్యత్యాసాన్ని తొలగించి అందరికీ ఒకే వేతనం ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో యూనియన్ నాయకులు సుబ్బారావు, రత్నం పాల్గొన్నారు.

అద్దంకి : మున్సిపల్ కార్మికుల సమస్యల పరిష్కారం, గతంలో కార్మికుల సమ్మె సందర్భంగా చేసుకున్న ఒప్పందాలు అమలు చేయాలని కోరుతూ ఈనెల 10 నుంచి రిలే నిరాహార దీక్షలు చేపట్టనున్నట్లు సిపిఎం కార్యదర్శి తంగిరాల వెంకటేశ్వర్లు తెలిపారు. సమ్మెకాలపు ఒప్పందాలు అమలు చేయాలని మున్సిపల్ మేనేజర్ బి. శ్రీదేవికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా తంగిరాల వెంకటేశ్వర్లు మాట్లాడుతూ కార్మికులకు రిటైర్డ్‌మెంట్ బెనిఫిట్స్ ఇవ్వాలన్నారు. మట్టిఖర్చులకు ఇచ్చే నగదును రూ.20 వేలకు పెంచాలన్నారు. ఎన్ఎంఆర్ కోవిడ్ బదిలీ కార్మికుల కు జీవో నెం 36 ప్రకారం జీతాలు చెల్లించాలన్నారు. పై సమస్యల పరిష్కారం కోసం రిలే నిరాహార దీక్షలు చేపట్టనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం బాపట్ల జిల్లా ఉపాధ్యక్షుడు వెంకటేశ్వర్లు, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు పి.ఆదాం, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ అద్దంకి కార్యదర్శి జి. భీష్మ, అలివేలమ్మ ఇంజనీరింగ్ వర్కర్స్ విభాగం నాయకులు ఉసురుపాటి సామ్యూలు, జాను, కె. మారుతి మార్కు పాల్గొన్నారు.

హార్బర్‌పై ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలి

సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు కొండారెడ్డి

ప్రజాశక్తి-కొత్తపట్నం

కొత్తపట్నం మండలంలోని పల్లెపాలెంలో నిర్మించ తలపెట్టిన ఫిషింగ్ హార్బర్‌పై ప్రజలకు స్పష్టత ఇవ్వాలని సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు జీవీ కొండారెడ్డి డిమాండ్ చేశారు. బుధవారం సీపీఎం ప్రతినిధి బృందం పల్లెపాలెంలో పర్యటించి మత్స్యకారులు, కార్మికులతో చర్చించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పల్లెపాలెంలో రూ.392.45 కోట్ల అంచనాతో ఫిషింగ్ హార్బర్ నిర్మించాలని 2016లో ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిందన్నారు. ఇందుకోసం 17.54 ఎకరాల భూమి సేకరించినట్లు ప్రకటించిందన్నారు. పలు దఫాలుగా ప్రజాభిప్రాయ సేకరణ సదస్సులు నిర్వహించింది కానీ నేటికీ పనులు ప్రారంభం కాలేదదన్నారు. తాజాగా త్వరలో పనులు ప్రారంభిస్తామని ప్రభుత్వం ప్రకటించిందని తెలిపారు. అయితే ఫిషింగ్ హార్బర్ నిర్మాణం వలన కలిగే లాభాలు, పర్యావరణం, మత్స్య కార్మికులకు జరిగే నష్టాల గురించి బహిరంగపరచడం లేదన్నారు. పైగా ఫిషింగ్ హార్బర్ నిర్మించకపోతే సముద్రం కోతకు గురై పల్లెపాలెం ముంపుకు గురవుతుందని అపోహ కల్పిస్తున్నారని తెలిపారు. 500 మీటర్ల ప్లాట్‌ఫారం నిర్మించి అవతలనే ఫిషింగ్ హార్బర్ నిర్మిస్తామని చెబుతున్నారని తెలిపారు. ప్రస్తుతం గ్రామంలో 1700 మత్స్యకార కుటుంబాలు నివసిస్తున్నాయని, 200కి పైగా డీజిల్ బోట్లతో చేపల వేట సాగిస్తూ జీవనం సాగిస్తున్నారని తెలిపారు. వచ్చిన చేపలకు సరైన ధర లేక దళారుల చేతుల్లో మోసపోతున్నారన్నారు. మర బోట్ల తాకిడితో జీవనం కోల్పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ స్థితిలో ఉన్న మత్స్య కార్మికుల జీవనం స్థితిని ఫిషింగ్ హార్బర్ నిర్మాణం మరింత దిగజార్చే ప్రమాదం కనిపిస్తున్నదని ఆందోళన వ్యక్తం చేశారు. ఫిషింగ్ హార్బర్ నిర్మాణం ద్వారా ఆ ప్రాంతంలో పెద్దపెద్ద బోట్లుకి అనుమతిస్తారన్నారు. సముద్రాన్ని పూడ్చడంవలన అలలు వచ్చినప్పుడు సముద్రపు నీరు ఎటువైపు వస్తుందో అర్థం కాని పరిస్థితి ఉందన్నారు. భూసేకరణ ఎక్కడ చేస్తారో చెప్పడం లేదని, హార్బర్ వలన మత్స్య, అనుబంధ రంగాల్లో కార్పొరేట్ శక్తులు ప్రవేశించి సాంప్రదాయ, మత్స్య కార్మికుల జీవనాన్ని దెబ్బతీసే ప్రమాదం కనిపిస్తుందన్నారు. వారి అస్తిత్వానికే ప్రమాదం రానుందని ఆందోళన వ్యక్తం చేశారు. అందువలన ప్రభుత్వం ఫిషింగ్ హార్బర్ నిర్మాణం యొక్క పూర్తి వివరాలను ప్రజలకు వివరించాల్సిన అవసరం ఉందన్నారు. రాజకీయ పార్టీలు, మత్స్య కార్మిక సంఘాలు, ప్రజలకు ప్రాతినిధ్యం వహించే సంఘాలు, సంస్థలతో సమావేశం ఏర్పాటు చేసి ప్రజల్లో వస్తున్న అపోహలకి సమాధానం ఇవ్వవలసిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. సముద్రపు తీరం వెంబడి ఆవాస ప్రాంతాలు లేని ప్రాంతాల్లో ఫిషింగ్ హార్బర్ నిర్మాణాన్ని చేపట్టే విషయాన్ని ప్రభుత్వం పరిశీలించాలని కోరారు. ఈ ప్రతినిధి బృందంలో సీపీఎం కొత్తపట్నం మండల కార్యదర్శి సోమిరెడ్డి, మండల నాయకులు పట్టపు ప్రకాశం, మత్స్య, కార్మిక ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

మత్స్యకారులతో మాట్లాడుతున్న సీపీఎం నేతలు

ప్రయాణికుల సౌకర్యమే లక్ష్యం

ఆర్టీసీ రీజనల్ మేనేజర్ సుధాకర్

ప్రజాశక్తి-ఒంగోలు సిటీ

ఆర్ఎం సుధాకర్

ప్రయాణీకుల సౌకర్యమే లక్ష్యంగా ఆర్టీసీ కృషి చేస్తున్నట్లు ఆ సంస్థ రీజనల్ మేనేజర్ బి.సుధాకర్ తెలిపారు. బుధవారం ఆయన ప్రజాశక్తితో మాట్లాడుతూ సంక్రాంతి పండుగ సందర్భంగా 9వ తేదీ నుంచి 12వ తేదీ వరకు 242 ప్రత్యేక బస్సు సర్వీసులను నడుపుతున్నట్లు వివరించారు. ఎక్కువ మొత్తంలో 220 సర్వీసులు హైదరాబాద్, 22 సర్వీసులు బెంగుళూరుకు నడుపుతున్నామన్నారు. ప్రయాణీకుల సౌకర్యం కోసం 9 ఇంద్ర సర్వీసులు, 98 సెమీ లగ్జరీ, 68 అల్ట్రా డీలక్స్, 67 ఎక్స్‌ప్రెస్ సర్వీసులు వివిధ డిపోల నుంచి నడుపుతున్నారని చెప్పారు. రీజియన్ పరిధిలో 30 శాతం కొత్త బస్సులు సమకూర్చినట్లు చెప్పారు. స్లీపర్ సర్వీసులు ఆపరేట్ చేయడంలో రాష్ట్రంలో ప్రకాశం మొదటి స్థానంలో నిలిచిందన్నారు. ఇదిలా ఉండగా ఇటీవల పామూరు వద్ద జరిగిన బస్సు ప్రమాదం దృష్ట్యా ఆర్టీసీతో పాటు ప్రైవేటు డ్రైవర్లకు రెండు రోజులు శిక్షణ ఇప్పించామన్నారు. అదేవిధంగా ప్రతి బస్సును నెలకోసారి టెక్నికల్ సిబ్బంది నిశితంగా పరిశీలించి క్లియరెన్స్ ఇప్పించే ప్రక్రియ చేపట్టినట్లు చెప్పారు. ప్రైవేటు ఆపరేటర్లకు సంబంధించి బస్సు డ్రైవర్లందరికీ వారి యాజమాన్యం ద్వారా ఇన్సూరెన్స్ చేయించే ప్రయత్నం చేస్తున్నట్లు వివరించారు. డ్రైవర్లపై ఒత్తిడి లేకుండా ఎంపిక చేసిన రూట్లలో గ్రౌండ్ బుకింగ్ పాయింట్లు పెంచుతున్నట్లు వివరించారు. అత్యవసర పరిస్థితుల్లో కాల్ డ్రైవర్ సేవలు వినియోగించుకునేందుకు కృషి చేస్తామన్నారు.

10న జిల్లాస్థాయి పారా అథ్లెటిక్స్ పోటీలు

ప్రజాశక్తి - ఒంగోలు సబర్బన్

పారా స్పోర్ట్స్ అసోసియేషన్ ఆఫ్ ప్రకాశం ఆధ్వర్యంలో ప్రకాశం జిల్లా క్రీడాప్రాధికార సంస్థ సహకారంతో జిల్లాస్థాయి పారా అథ్లెటిక్స్ పోటీలు ఈనెల 10వ తేదీన ఒంగోలులోని మినీ స్టేడియంలో నిర్వహిస్తున్నట్లు పారా స్పోర్ట్స్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు రామస్వామి, సుధీర్ పాల్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పోటీలలో జిల్లాలోని దివ్యాంగ క్రీడాకారులందరూ పాల్గొనాలని కోరారు. ఈ పోటీలలో ప్రతిభ చూపిన వారిని ఈనెల 30న జరిగే రాష్ట్రస్థాయి పారా అథ్లెటిక్స్ పోటీలకు ఎంపిక చేయడం జరుగుతుందని పేర్కొన్నారు. జిల్లా స్థాయి పారా అథ్లెటిక్స్ పోటీలను జయప్రదం చేయాలని కోరారు.

పార్కుల ప్రైవేటీకరణను ఉపసంహరించుకోవాలి

సీపీఎం ఒంగోలు నగర కార్యదర్శి చీకటి శ్రీనివాసరావు

ప్రజాశక్తి-ఒంగోలు సిటీ

ఒంగోలు నగరంలో పార్కుల ప్రైవేటీకరణను ఉపసంహరించుకోవాలని సిపిఎం ఒంగోలు నగర కమిటీ డిమాండ్ చేసింది. సుందరీకరణ పేరుతో నగరంలోని 24 పార్కుల నిర్వహణ ప్రైవేటు వ్యక్తులకు ఇవ్వాలని నగర కార్పోరేషన్ తలపెట్టినట్లు బుధవారం నాడు సిపిఎం నగర కార్యదర్శి చీకటి శ్రీనివాసరావు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పార్కుల నిర్వహణ పాలకవర్గం పర్యవేక్షించాలని సూచించారు. నగరంలో తాగునీటి సమస్యతో పాటు పలు మౌలిక సమస్యలని పరిష్కరించాలని కోరారు. ట్యాంకర్ల ద్వారా తాగునీరు సరఫరా చేసే ప్రాంతాల్లో శాశ్వత పైపులైన్ల ద్వారా సరఫరా చేయాలని సూచించారు. నగరంలో తాగునీరు ఉదయం ఐదు గంటల నుంచి రాత్రి 10 గంటల మధ్య సరఫరా చేస్తున్నట్లు శివారు ప్రాంతాల్లో సరఫరా చేయాలని కోరారు. రాత్రి వేళల్లో పారిశుధ్య పనులు చేపట్టడం అత్యంత ప్రమాదకరమైన అంశమని, ఈ పనిని తక్షణం నిలిపివేయాలని, పగటి పూట మాత్రమే పని చేయించాలని డిమాండ్ చేశారు. ప్రధాన వీధుల్లో కూడా విద్యుత్ దీపాలు వెలగని పరిస్థితి ఉందని, తక్షణం ఆయా చోట్ల విద్యుత్ సౌకర్యం కల్పించాలని కోరారు. నగరంలో జనాభా పెరిగిన నేపథ్యంలో ట్రాఫిక్ సమస్యలు తలెత్తుతున్నాయన్నారు. సమగ్ర ప్రణాళిక రూపొందించడం ద్వారా ట్రాఫిక్ సమస్యను పరిష్కరించాలన్నారు. ముఖ్యంగా ఆసుపత్రిలు ఎక్కువగా ఉన్న సుందరయ్య భవనం రోడ్డు డివైడింగ్ ప్రక్రియ వల్ల అత్యవసర రోగులు వచ్చే అంబులెన్సులు రవాణా, రోగుల రాకపోకలకు అంతరాయం ఏర్పడినట్లు చెప్పారు. రోడ్డు మధ్య ఏర్పాటు చేసిన పార్కింగ్ ఎత్తివేయాలని కోరారు. అన్ని ప్రాంతాల సైడ్ డ్రైన్లు ఆక్రమణలు తొలగించాలని కోరారు. నగర సుందరీకరణలో భాగంగా ఆరు ప్రధాన సమస్యలను ప్రాధాన్యత క్రమంలో పరిష్కరిస్తామని ఒంగోలు శాసనసభ్యులు దామచర్ల జనార్ధనరావు కార్పోరేషన్ అధికారులతో చర్చించిన అంశాన్ని ఈ సందర్భంగా గుర్తు చేశారు. ఆ మేరకు నగరంలో ప్రాధాన్యత క్రమంలో పనులు చేపట్టాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

భూములను పున: పరిశీలన చేయాలి

సిసిఎల్ఎ ప్రత్యేక ముఖ్య కార్యదర్శి జయలక్ష్మి

ప్రజాశక్తి - బాపట్ల జిల్లా

నిషేధిత భూముల జాబితా నుంచి తొలగించిన భూములను పున పరిశీలన చేయాలని సిసిఎల్ఎ ప్రత్యేక ముఖ్య కార్యదర్శి జయలక్ష్మి తెలిపారు. అమరావతి నుంచి అన్ని జిల్లాల కలెక్టర్లతో బుధవారం వీక్షణ సమావేశం నిర్వహించారు. జిల్లా నుంచి జిల్లా కలెక్టర్ జె.వెంకట మురళి హాజరయ్యారు. నిషేధిత భూముల జాబితాలో నుంచి తొలగించిన భూములు చట్టబద్ధంగా రిజిస్ట్రేషన్ అయ్యా యా లేదా పరిశీలించాలని జయలక్ష్మి తెలిపారు. ఇప్పటి వరకు బాపట్ల జిల్లాలో 78.84 శాతం పరిశీలన జరిగిందన్నారు. మిగిలిన వాటిని యుద్ధ ప్రాతిపదికన పరిశీలించాలన్నారు. రెవెన్యూ సదస్సు ల్లో వచ్చిన అర్జీలపై తహశీల్దా ర్లు ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. ఈ సమావేశంలో జిల్లా సంయుక్త కలెక్టర్ ప్రఖర్ జైన్, జిల్లా రెవెన్యూ అధికారి జి.గంగాధర్ గౌడ్ పాల్గొన్నారు.

సమావేశంలో పాల్గొన్న కలెక్టర్ వెంకట మురళి, సంయుక్త కలెక్టర్ ప్రఖర్ జైన్

తుది దశకు సీసీ రోడ్ల నిర్మాణం

ప్రజాశక్తి-కొత్తపట్నం

కొత్తపట్నం మండలంలోని ఏడు గ్రామ పంచాయతీలలో సిమెంట్ రోడ్ల నిర్మాణం తుది దశకు చేరినట్లు ఈవోఆర్డీ మూర్తి తెలియజేశారు. గవడ్లపాలెం గ్రామంలోని సిమెంటు రోడ్ల నిర్మాణాన్ని ఆయన బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొత్తపట్నం మండలంలోని ఈతముక్కల, రాజుపాలెం, వజ్జీ రెడ్డిపాలెం, గమండ్లపాలెం, పల్లెపాలెం, రంగాయపాలెం, గాదేపాలెం గ్రామాలలో ఏడు కోట్ల 50 లక్షల ఎన్ఆర్ఈజీఎస్ నిధులతో ఈ సిమెంట్ రోడ్లు నిర్మాణం జరుగుతున్నట్లు ఆయన తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఈవోఆర్డీ మూర్తి, పంచాయతీ కార్యదర్శి బాలాజీ, టీడీపీ నాయకులు బలగాన్ని వెంకటేశ్వర్లు, పిఆర్ ఏఈ వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

పనులు పరిశీలిస్తున్న కమిషనర్ వెంకటేశ్వరరావు

అభివృద్ధి పనులు పరిశీలన

ప్రజాశక్తి-ఒంగోలు సబర్బన్

స్థానిక 15వ డివిజన్ రాంనగర్ ప్రాంతంలో జరుగుతున్న అభివృద్ధి పనులను నగరపాలక సంస్థ కమిషనర్ కె.వెంకటేశ్వరరావు బుధవారం పరిశీలించారు. రాంనగర్ ఆరో లైన్‌లో ఉన్న పార్కులో జరుగుతున్న పనులు, రాంనగర్ ఆరో లైన్ నుంచి 10వ లైన్ వరకు ఉన్న సర్వీసు రోడ్డులో డ్రైనేజీ ఆక్రమణల తొలగింపు, గ్రీన్ బెల్ట్ ఏర్పాటు పనులను కమిషనర్ పరిశీలించారు. కాంట్రాక్టర్లు, అధికారులకు పలు సూచనలు చేశారు. కమిషనర్ వెంట స్థానిక కార్పొరేటర్ చింతపల్లి గోపీచంద్, కార్పొరేషన్ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ పద్మజ, అసిస్టెంట్ ఇంజనీర్ రాజశేఖర్ రెడ్డి, సర్వేయర్ ఆవుల శ్రీనివాసరావు, స్థానిక టిడిపి నాయకులు గడ్డం ఆదినారాయణ, శానిటేషన్, టౌన్ ప్లానింగ్, సచివాలయ సిబ్బంది తదితరులు ఉన్నారు.

ఎస్పీ దామోదర్‌కు డ్రోన్ కెమెరా అందజేస్తున్న రవిచంద్ర

డ్రోన్ కెమెరా అందజేత

ప్రజాశక్తి-టంగుటూరు

టంగుటూరు మండలంలోని ఆలకూరపాడు గ్రామానికి చెందిన ఎన్ఆర్ఐ అనుమెలు రవిచంద్ర బుధవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో ప్రకాశం జిల్లా ఎస్పీ ఏఆర్ దామోదర్‌కు డ్రోన్ కెమెరా అందజేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ సేవా స్ఫూర్తితో డ్రోన్‌ను బహూకరించడం అభినందనీయమన్నారు. పోలీస్ శాఖ తరుపున దాతకు కతజ్ఞతలు తెలిపారు. ఈ డ్రోన్ కెమెరాల ద్వారా నేరాలను నియంత్రించడం, శాంతి భద్రతల పరిరక్షణకు ఉపయోగించడం జరుగుతుందన్నారు. కానిస్టేబుళ్లకు డ్రోన్ ఆపరేట్ చేసే విధంగా శిక్షణ ఇచ్చినట్లు తెలిపారు.

తోటల్లో కనపించని మొక్కలు

సామాజిక తనిఖీలో బయటపడిన వైనం

ప్రజాశక్తి-కొండపి

జాతీయ ఉపాధి హామీ పథకంలో భాగంగా పంట్లతోటలో నాటిన మొక్కలు మాయమయ్యాయి. సామాజిక తనిఖీలో ఈ విషయం బయట పడింది. మండలంలోని ఇలవర గ్రామంలో రూ.60 వేల విలువైన మొక్కలు నాటారు. కొన్ని మొక్కలు ఎండిపోగా మరికొన్ని కనపడలేదు. ఈ విషయాన్ని సామాజిక తనిఖీ అధికారి వెంకటేశ్వరరావు తెలిపారు. బుధవారం మండలంలోని ఇలవర, చిన్నకండ్లగుంట గ్రామాలలో ఉపాధి హామీ పనులపై సామాజిక బృందం అధికారులు తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా డీఆర్‌పీ జి.కిరణ్‌కుమార్ ఆధ్వర్యంలో నిర్వహించిన సభలో ఎస్ఆర్‌పి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ఇలవరలో రూ.60 వేల విలువైన మొక్కలు నాటిన పనుల్లో తేడాలు ఉన్నాయన్నారు. రెండు గ్రామాలలో బినామీ పేర్లు, కొలతలలో తేడా, మస్టర్‌లో తేడా కనిపంచాయని తెలిపారు. ఈ నివేదికను పైఅధికారులకు అందజేయనున్నట్లు ఆయన చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో రామాజంనేయులు, ఎంఈవో రామారావు, ఏపీవో మహాలక్ష్మి, సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

వివరాలు వెల్లడిస్తున్న విజిలెన్స్ అధికారి టి హైమావతి

విద్యుత్ విజిలెన్స్ దాడులు

ప్రజాశక్తి - కురిచేడు

మండలంలోని వివిధ గ్రామాల్లో విద్యుత్ విజిలెన్స్, ఆపరేషన్ అధికారులు సంయుక్తంగా బుధవారం తనిఖీలు నిర్వహించారు. విజిలెన్స్ ఇఇ టి హైమావతి, ఒంగోలు ఇఇ పి శ్రీనివాసులు, దర్శి డిఇ డివి కృష్ణారెడ్డి, డి హరిబాబు, పొదిలి డిఇ ఆర్ మోహనరావు కురిచేడు ఎఇ బి రామకృష్ణ సంయుక్తంగా నిర్వహించిన విజిలెన్స్ తనిఖీల్లో 28 మంది విద్యుత్ చౌర్యానికి పాల్పడగా 44 మంది లోడ్ అదనంగా వాడుతున్నట్లు గుర్తించామని తెలిపారు. వీరిలో విద్యుత్ చౌర్యానికి పాల్పడిన వారి నుండి రూ.1,49,000, అదనుపు లోడు వినియోగిస్తున్న వారి నుండి రూ.1,68,000 జరిమాన విధించినట్లు తెలిపారు. కార్యక్రమంలో దర్శి డివిజన్ పరిధిలోని 11 మండలాల ఎఇలు, జెఇలు మొత్తం 90మంది సిబ్బంది పాల్గొన్నారు.

'బంగారు బాల్యం'కు టాప్ ర్యాంక్

ప్రజాశక్తి - కనిగిరి

బిఎల్‌డి ఓ శ్రీనివాసరెడ్డి

జాతీయ స్థాయిలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం మరోసారి సత్తా చాటిందని కనిగిరి డివిజన్ డిఎల్‌డిఓ శ్రీనివాసరెడ్డి తెలిపారు. స్కోచ్ సంస్థ నిర్వహించిన సర్వేలో కలెక్టర్ సారథ్యంలో అమలవుతున్న బంగారు బాల్యం ప్రాజెక్టుకు టాప్ ర్యాంకు దక్కించుకుందని తెలిపారు. దేశంలో ఆయా రాష్ట్రాలు అమలు చేస్తున్న పరిపాలనా విధానాలు, తీసుకొస్తున్న కొత్త సంస్కరణలు, ప్రజల సంక్షేమం కోసం అమలు చేస్తున్న పథకాలతో పాటు వివిధ అంశాలపై ప్రతి ఏటా స్కోచ్ సంస్థ అధ్యయనం చేస్తోందని అన్నారు. ఈ నెల 2నుండి 6వరకు జరిగిన ఆన్‌లైన్ ఓటింగ్ నిర్వహించిందని, ఈ ఓటింగులో కనిగిరి డివిజన్‌లోని అన్ని శాఖల ప్రభుత్వ ఉద్యోగులు, బంగారు బాల్యం కమిటీలు, ప్రజాప్రతినిధులు, జర్నలిస్టులు, ఎన్‌జిఓ ప్రతిని ధులు, ప్రజలు ఆన్‌లైన్ ఓటింగులో పాల్గొని ఓటింగ్ వేసి బంగారు బాల్యం ప్రాజెక్టును జాతీయ స్థాయిలో మొదటి స్థానంలో ఉంచినందుకు అందరికి ధన్యవాదములు తెలిపారు.

బైకుపై నుండి పడి వ్యక్తికి గాయాలు

ప్రజాశక్తి - సిఎస్ పురం

గాయపడిన దొరస్వామి

మండలంలోని మైలుచర్లకు చెందిన దొర స్వామి, నారు తిరుమలయ్య ద్విచక్ర వాహనంపై నుండి క్రింద పడి తీవ్రంగా గాయపడ్డారు. ఇద్దరూ బైకుపై సిఎస్ పురం వస్తుండగా సిఎస్‌పురంకు సమీపంలోనికి రాగానే గేదలు అడ్డు రావడంతో వాటిని తప్పించబోయి బైకు అదుపుతప్పి కింద పడ్డారు. ప్రమాదంలో రంగస్వామి తల, కాళ్లకు తీవ్ర గాయాలు కాగా మరో వ్యక్తికి స్వల్ప గాయాలు అయ్యాయి. చికిత్స నిమిత్తం గుంటూరులోని ఓ ప్రైవేటు వైద్యశాలకు తరలించారు.

మానవత్వం చాటుకున్న కార్తీక్

అర్ధరాత్రి సమయంలో ప్రమాదం జరిగిన విషయాన్ని తెలుసుకున్న టిడిపి యువ నాయకులు మన్నేపల్లి కార్తీక్ వెంటనే ప్రమాద స్థలానికి వచ్చారు. గాయాలతో రోడ్డుపై పడి ఉన్న క్షతగాతులను వాహనం తెప్పించి ఒంగోలు వైద్యశాలకు తరలించారు. క్షతగాత్రులను ఆదుకున్నందుకు కార్తీక్‌ను పలువురు అభినందించారు.

మహిళా ఉద్యమ నేత మంగమ్మకు నివాళి

ప్రజాశక్తి - పామూరు

మంగమ్మ చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న సిపిఎం నాయకులు

ఐద్వా ఉద్యమ నేత మండ్లా మంగమ్మ ఆసియాల కోసం ప్రతి కార్యకర్త పనిచేయాలని సిపిఎం మండల కార్యదర్శి షేక్ ఖాదర్ బాషా, సిపిఎం జిల్లా నాయకులు కొమ్మలపాటి మాల్యాద్రి కార్యకర్తలను కోరారు. మంగమ్మ 8వ వర్ధంతి సభ ఎస్‌కె మదారమ అధ్యక్షతన బుధవారం నిర్వహించారు. ముందుగా మంగమ్మ చిత్రపటానికి ఐద్వా సీనియర్ నాయకురాలు మదారమ్మ పూల మాలవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మాల్యాద్రి మాట్లాడుతూ మంగమ్మ మహిళల కోసం నిరంతరం శ్రమించిన వ్యక్తని అన్నారు. ఆపదలో ఉన్న మహిళలను ఆదుకోవడంలో ఆమెకు సాటి లేదన్నారు. సారాయి ఉద్యమంలో ప్రాణలను సైతం లెక్క చేయకుండా పోరాడిన గొప్ప నాయకురాలని అన్నారు. మండలంలో అన్ని రాజకీయ పార్టీల నాయకులను అన్నా తమ్ముడు అని ఆప్యాయంగా పిలిచే గొప్ప నాయకురాలు మంగమ్మ అని అన్నారు. ప్రతి ఒక్కరి నోట అక్క అని గొప్పగా పిలిపించుకుంటూ మంచి పేరు సంపాదించుకున్నారని అన్నారు. కార్యక్రమంలో భానుమతి, మహిళా శాఖ కార్యదర్శి రమీజా, మస్తానమ్మ, ధనలక్ష్మి, ఖాదర్ ఉన్నేసా, చల్లా వెంకటేశ్వర్లు, బి నాగేశ్వరావు పాల్గొన్నారు.

ఆక్రమణకు గురైన దోబీఘాట్‌ను కాపాడండి

రజక వృత్తిదారుల సంఘం డిమాండ్

ప్రజాశక్తి - హనుమంతునిపాడు

ఆక్రమణకు గురైన ధోబి ఘాట్

స్థానిక ఆర్ అండ్ బి రోడ్డు ప్రక్కన సర్వే నెంబర్ 52ఎలో 8.62 ఎకరాల భూమిని రజక వృత్తి దారుల ఎర్ర వాగు దోబీ ఘాట్‌కు 1997లో ఇచ్చారని, ఆ స్థలంను ఆక్రమణదారుల నుండి కాపాడాలని రజక వృత్తిదారుల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి రాయల మాలకొండయ్య డిమాండ్ చేశారు. మండల కేంద్రమైన హనుమంతునిపాడులో బుధవారం జరిగిన రెవెన్యూ సదస్సులో రజక వృత్తిదారుల సంఘం ఆధ్వర్యంలో తహశీల్దారు దిలీప్ కుమార్‌కు వినత పత్రం అందజేశారు. అనంతరం సంఘం జిల్లా కార్యదర్శి రాయల మాలకొండయ్య మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో అనాథగా వస్తున్న రజక వృత్తి దారులు కుంటలు, చెరువులు, దోబిఘాట్లు ఆక్రమణకు గురవుతున్నాయని, ఆక్రమణ నుంచి కాపాడి రజక వృత్తి దారులకు కేటాయించాలని అన్నారు. మోరావారిపల్లి గ్రామస్తులు ఆక్రమణకు గురిచేసారని, ఆ స్థలంలో చనిపోయిన మనుషులను పూడ్చి పెడుతున్నారని అన్నారు. కొందరు పంటలు కూడా వేశారని వెంటనే రెవెన్యూ అధికారులు పరిశీలించి, స్పందించి ధోబిఘాట్ స్థలం రజక వృత్తి దారులకు అప్పజెప్పాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ కార్మిక సంఘం ఉపాధ్యక్షులు బడుగు వెంకటేశ్వర్లు, రజక వృత్తి దారులు ఆర్నూరి చెన్నయ్య, తిరుమలపూడి నాగేశ్వరరావు, వినుకొండ బాలకృష్ణ, ఆర్నూరీ చందు, ఆర్నూరి లక్ష్మయ్య, వినుకొండ రమేష్, ఆర్నూర్ కేశవులు, వినుకొండ కేశవరావు, వినుకొండ చిన్నబాబు, ఆర్నూరి బాల పాల్గొన్నారు.

ప్రభుత్వం ఇచ్చిన పట్టాలకు స్థలం చూపండి

ప్రజాశక్తి - హనుమంతునిపాడు

పట్టాలకు పొజిషన్ చూపించాలని వినతి పత్రం అందజేస్తున్న పట్టాదారులు

పేదలకు ఇచ్చిన ఇంటి పట్టాలకు పొజిషన్ చూపించాలని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో బుధవారం జరిగిన రెవిన్యూ సదస్సులో తహశీల్దారు దిలీప్ కుమార్‌కు స్థానిక పేదలు వినతిపత్రం అందజేరు. ఈ సందర్భంగా వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు బడుగు వెంకటే శ్వర్లు మాట్లాడుతూ 2018 డిసెంబర్లో మండల కేంద్రంలోని పేదలు 47 మందికి ఒక్కొక్కరికి రెండున్నర సెంట్లు చొప్పున సర్వేనెంబర్ 57/ఎ2లో ఇళ్ల స్థలాలు సంఘం పోరాడి సాధించిందని తెలిపారు. అయితే పట్టాలు చేతిలో పెట్టి నేటికీ పొజిషన్ చూయించలేదని తెలిపారు. వెంటనే పేదలకు ఇచ్చిన స్థలాలకు పొజిషన్ చూయించాలని డిమాండ్ చేశారు. 1985లో నాటి ప్రభుత్వం రైతుల దగ్గర కనిగిరి రిజిస్టర్ కార్యాలయం బుక్కు నెంబర్ ఒకటి నందు రిజిస్టర్ చేయించుకుని ప్రజా అవసరాల నిమిత్తం పేదల ఇళ్ల స్థలాల కొరకు ఆ స్థలం ప్రభుత్వం కొనుగోలు చేసిందని తెలిపారు. ఈ స్థలంలో కొంత భాగం పోలీసు స్టేషన్ నిర్మించగా మిగిలిన స్థలంలో పేదలకు పట్టాలు ఇచ్చిన విషయం గుర్తు చేశారు. ఇచ్చిన పట్టాలకు కాలనీలు శాంక్షన్ చేస్తామని, గత ప్రభుత్వం ఒరిజినల్ పట్టాలు పేదల దగ్గర నుండి తీసుకొని పేదల చేతికి జెరాక్స్‌లు ఇచ్చారని తెలిపారు. కాలనీలు చూపించకపోగా మేము సొంతంగా నిర్మించు కుంటామని, తమకు ఇచ్చిన స్థలాలు ఎక్కడో చూయించండని అధికారుల చుట్టూ పలుమార్లు తిరిగినప్పటికీ అధికారులు పట్టించుకోవడంలేదని తెలిపారు. పేదల పట్ల ఇంత నిర్లక్ష్యం తగదని, తక్షణమే ఇంటి స్థలాలకు పొజిషన్ చూపించడంతోపాటు పేదలకు పక్కా గృహాలు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాగులూరు సుబ్బులు, బుజ్జమ్మ, గురునాథం రాములుతోపాటు స్థానిక లబ్ధిదారులు పాల్గొన్నారు.

వైసిపి వాలంటీర్ వింగ్ అధ్యక్షునిగా రసూల్

ప్రజాశక్తి - కనిగిరి

వాలంటీర్ జిల్లా అధ్యక్షులు డాక్టర్ నాయబ్‌రసూల్

పట్టణానికి చెందిన ఫిజియోథెరపీ వైద్యులు డాక్టర్ నాయబ్ రసూల్ వైసిపి వాలంటీర్ విభాగం జిల్లా అధ్యక్షునిగా నియమితులు అయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తనపై నమ్మకం ఉంచి బాధ్యతలు అప్పగించిన వైసీపీ జిల్లా అధ్యక్షులు బూచేపల్లి శివప్రసాదరెడ్డి, ఒంగోలు పార్లమెంటు ఇన్‌ఛార్జి చెవిరెడ్డి భాస్కరరెడ్డి, వైసిపి ఇన్చార్జి దద్దాల నారాయణ యాదవ్, రీజనల్ కో ఆర్డినేటర్ కారుమూరి నాగేశ్వరరావు, స్టేట్ వాలంటరీ విభాగం అధ్యక్షులు నాగార్జున యాదవ్‌కు ధన్యవాదాలు తెలిపారు. వైసిపి అభివృద్ధికి తనవంతు కృషి చేస్తానని తెలిపారు.

ప్రభుత్వ పథకాలు ఉపయోగించుకోవాలి

ప్రజాశక్తి - తాళ్లూరు

తురకపాలెంలో రైతులతో మాట్లాడుతున్న ఎఒ ప్రసాదరావు

పశువర్ధక శాఖలో అమలయ్యే పథకాలను రైతులు ఉపయోగించుకోవాలని వ్యవసాయ అధికారి బి ప్రసాదరావు అన్నారు. మండలంలోని తురకపాలెం, మన్నేపల్లి గ్రామాల్లో పోలం పిలుస్తుంది కార్యక్రమం బుధవారం నిర్వహించారు. అందులో భాగంగా రైతులకు పశువార్ధక శాఖలో అమలయ్యే పథకాల గురించి వివరించారు. 10 సెంట్ల స్థలంలో కూలీలకు అయ్యే ఖర్చుకు రూ.6559, 20 సెంట్లకు రూ.13197, 30 సెంట్లకు రూ.19195, 40 సెంట్లకు రూ.26394, 50సెంట్లకు రూ.32952 పశు పోషకులకు ఇవ్వనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో రైతులు పాల్గొన్నారు.

పెన్షనర్ల సమస్యలు పరిష్కరిస్తాం

ప్రజాశక్తి-బాపట్ల

పెన్షనర్ల సమస్యలను పరిష్కరిస్తామని డైరెక్టర్ ఆఫ్ ట్రెజరీ అండ్ అకౌంట్స్ అధికారి డిఎన్. మోహనరావు తెలిపారు. స్థానిక ఎన్‌జిఒ హోంటో రాష్ట్ర ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగులత అసోసియేషన్, బాపట్ల తాలూకా యూనిట్ ఆధ్వర్యంలో పెన్షనర్స్ డే బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా మోహన్ రావు మాట్లాడుతూ కమ్యూటేషన్ రికవరీ నిలుపుదలకు ఉత్తర్వులు ఇచ్చినట్లు గుర్తు చేశారు. పెన్షనర్ల సాధారణ సమస్యలైన ఫ్యామిలీ పెన్షన్లకు సంబంధించి పుట్టిన తేదీ, పేరులో సవరణల పై ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపినట్లు తెలిపారు. దానికి సంబంధించిన ఉత్తర్వులు త్వరలోనే వస్తాయని అని తెలిపారు.తొలుత డిఎస్ నఖారా చిత్రపటానికి పూలమాలవేసి నివాళు లర్పించారు. పెన్షనర్స్ సంఘం డైరీ, క్యాలెండర్ ను ఆవిష్కరించారు. అనంతరం సీనియర్ పెన్షనర్లు టి.వెంకటరంగం, ఎల్.మాణిక్యరావ్, విశ్వేశ్వరరావు, శివబ్రహ్మం, టి. వల్లయ్య, మహదేవ్, కష్ణ ప్రసాద్, వీరభద్రయ్య, కె. శైలజను ఘనంగా సన్మానించారు.ఈ కార్యక్రమంలో జిల్లా శాఖ అధ్యక్షులు వైవి. నరసింహారావు, రాష్ట్ర అధ్యక్షులు పిఎస్ఎస్ఎన్‌పి.శాస్త్రి, రాష్ట్ర కార్యదర్శులు బి. లవ్‌కుమార్, ఎన్. నారాయణ, జిల్లా ఖజానా అధికారి జగన్నాథరావు, ఎటిఒ ఎస్. అనురాధ, ఉప ఖజానా అధికారి ఎన్. అనూరాధ పాల్గొన్నారు.

మాట్లాడుతున్న మోహనరావు

రెడ్ క్రాస్ బ్లడ్ బ్యాంకు ప్రారంభం

ప్రజాశక్తి - బాపట్ల

అత్యవసర పరిస్థితుల్లో ప్రాణాలు నిలబెట్టేందుకు అవసరమైన రక్తాన్ని అందుబాటులో ఉంచేందుకు బాపట్లలో రక్త నిల్వ కేంద్రాన్ని ఏర్పాటు చేసిన రెడ్ క్రాస్ సొసైటీ సేవలు అభినందనీయమని ఎమ్మెల్యే వేగేశన నరేంద్ర వర్మ తహశీల్దారు కార్యాలయం వద్ద ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన రెడ్ క్రాస్ రక్త నిల్వ కేంద్రాన్ని ఎమ్మెల్యే నరేంద్ర వర్మ బుధవారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో బాపట్ల పట్టణ మున్సిపల్ కమిషనర్ రఘునాథరెడ్డి , రెడ్ క్రాస్ సొసైటీ జిల్లా కార్యదర్శి బిఎస్. నారాయణ భట్టు, టిడిపి పట్టణ అధ్యక్షుడు గొలపల శ్రీనివాసరావు, సి. హెచ్. నాగలేశ్వరావు, బూర్లె రామ సుబ్బారావు, దేశిరాజు వెంకటరమణ బాబు, రెడ్ క్రాస్ ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

బ్లడ్ బ్యాంకును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే నరేంద్ర వర్మ

నేడు ఉచిత వైద్యశిబిరం

ప్రజాశక్తి- ఇంకొల్లు

బాపట్ల-2 విశ్రాంత ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో గురువారం ఉచిత కంటి వైద్యశిబిరం నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. పల్నాడు జిల్లా నరసరావు పేటలోని మ్యాక్సీ విజన్ కంటి ఆసుప్రతి వైద్యుడు డాక్టర్ రామలింగారెడ్డి సహకారంతో స్థానిక విశ్రాంత ఉద్యోగుల సంఘం కార్యాలయంలో వైద్యశిబిరం నిర్వహించనున్నట్లు బాపట్ల-2 జిల్లా విశ్రాంత ఉద్యోగుల సంఘంకార్యదర్శి కరి కమలేశ్వరరావు తెలిపారు.

12న షటిల్ బ్యాడ్మింటన్ పోటీలు

ప్రజాశక్తి -కారంచేడు

సంక్రాంతి పండుగను పురస్కరించుకుని ఈనెల 12న గుంటూరు, ప్రకాశం ఉమ్మడి జిల్లాల స్థాయిలో షటిల్ బ్యాడ్మింటన్ పోటీలు నిర్వహిస్తున్నట్లు నిర్వహకులు తెలిపారు. కారంచేడులోని డాక్టర్ రామానాయుడు ఇండోర్ స్టేడియంలో ఈ పోటీలు నిర్వహించనున్నట్లు కారంచేడు, పర్చూరు, వంకాయలపాడు బ్యాడ్మింటన్ యూత్ కమిటీ ప్రతినిధులు బుధవారం తెలిపారు. ఈ టోర్నమెంట్‌కు పర్చూరు ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు, సినీ నటుడు కొల్లా అశోక్ కుమార్, ఇతర ప్రముఖులు హాజరుకానున్నట్లు తెలిపారు. ఆసక్తి కలిగిన క్రీడాకారులు ప్రవేశ రుసుము చెల్లించి తమ పేర్లను నమోదు చేసుకోవాలన్నారు.

జడ్‌పి హైస్కూల్‌లో తనిఖీ

ప్రజాశక్తి వేటపాలెం

మండల పరిధిలోని పందిళ్ళపల్లి జిల్లా పరిషత్ హైస్కూల్‌లో సమగ్ర శిక్ష, మధ్యాహ్న భోజనం పథకాన్ని స్టేట్ రిసోర్స్ పర్సన్ పి. వెంకటేష్ నాయక్ బుధవారం అకస్మికం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పలు రికార్డులను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు మెడబలిమి శేఖర రావు, స్కూల్ మేనేజమెంట్ వైస్ చైర్మన్ బండ్ల భారతి, స్టాఫ్ సెక్రటరీ బుద్ధిమోహనరావు, ఉమ్మిటి వేణుగోపాల రావు, రికార్డ్ అసిస్టెంట్ సుజాత, కంప్యూటర్ ఆపరేటర్ హరీష్ కుమార్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ముగ్గుల పోటీలు

ప్రజాశక్తి-భట్టిప్రోలు

సంక్రాంతి సంబరాల్లో భాగంగా స్థానిక మాత ఇంగ్లీష్ మీడియం హై స్కూల్‌లో విద్యార్థినులకు బుధవారం ముగ్గుల పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ కొత్త రవితేజ మాట్లాడుతూ సంక్రాంతి పండుగను సాంప్రదాయబద్ధంగా నిర్వహించడం ఆనందదాయకమన్నారు. విజేతలకు బహుమతులు ప్రదానం చేయనున్నట్లు ఆయన తెలిపారు. ఈ పోటీలకు న్యాయనిర్ణేతగా తోనుగుంట్ల నాగమణి వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో సాయిలక్ష్మి, మణిదీపిక, బూరెల అరుణ కుమారి పాల్గొన్నారు.

క్రీడా వికాస కేంద్రం అభివృద్ధికి నిధులు విడుదల : ఎమ్మెల్యే

ప్రజాశక్తి- పర్చూరు

పర్చూరులోని ఎన్‌టిఆర్ క్రీడా వికాస కేంద్రం అభివద్ధికి ప్రభుత్వం రూ.30 లక్షల నిధులు విడుదల చేసినట్లు ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు తెలిపారు. ఎన్‌టిఆర్ క్రీడా వికాస కేంద్రంలో అసంపూర్తిగా ఉన్న పనులను పూర్తి చేసేందుకు నిధులు మంజూరు చేయాలని ట్రాన్స్‌ఫోర్ట్,యూత్ అండ్ స్పోర్ట్స్ మంత్రి మండిపల్లి రాంప్రసాద్, ఆంధ్రప్రదేశ్ క్రీడా ప్రాధికార సంస్థ చైర్మన్ అనిమిని రవి నాయుడుకు ఇటీవల తాను లేఖ రాసినట్లు ఎమ్మెల్యే తెలిపారు. దీంతో స్పందించిన ప్రభుత్వం అసంపూర్తిగాఉన్న పనులు పూర్తి చేసేందుకు, బ్యాండింటన్ ఇండోర్ స్టేడియం , జిమ్, వాకింగ్ ట్రాక్, ఫెన్సింగ్ నిర్మాణం కోసం నిధులను విడుదల చేసినట్లు ఎమ్మెల్యే ఏలూరి తెలిపారు.

మాట్లాడుతున్నఎంపిపి రత్నప్రసాద్

మండలాభివృద్ధికి కృషి : ఎంపిపి

ప్రజాశక్తి - చెరుకుపల్లి

అధికారులు,ప్రజా ప్రతినిధులు సమన్వయంతో పనిచేసి మండలాన్ని ప్రగతి పథంలో ముందు నడిపించాలని ఎంపిపి మత్తి దివాకర రత్న ప్రసాద్ తెలిపారు. మండల పరిషత్ కార్యాలయంలో మండల సర్వసభ్య సమావేశం ఇఒపిఆర్‌డి శ్రీనివాసన్ అధ్యక్షతన బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపిపి మాట్లాడుతూ అధికారులు మరియు ప్రజాప్రతినిధులు అందరూ కషిచేసి మండలాన్ని జిల్లాలోనే అగ్రగామిగా నిలిపేందుకు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో సర్పంచులు, ఎంపిటిసిలు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

వయోజన విద్య వాచకాలు అందజేత

ప్రజాశక్తి-వేటపాలెం

స్వయం సహాయక సంఘాల మహిళల జీవన ప్రమాణాలు మెరుగుపరిచే విధంగా కృషి చేయాలని వయోజన విద్య పర్యవేక్షకులు కొణిదల మనోరంజన్ తెలిపారు. ఉల్లాస్ వాలంటరీలకు వెలుగు కార్యాలయంలో బుధవారం మెటీరియల్ అందజేశారు. వయోజన విద్య వాచకాలు, గైడ్లు, హాజరు పట్టికలను ఎంఇఒ సుబ్బయ్య అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎపిఎఒం అంజిబాబు , వాలంటీర్లు, విఒఎలు పాల్గొన్నారు.

ఇంకొల్లు : వయోజన విద్య వాలంటీర్లకు వాచకాలు, గైడ్లు, హాజరు పట్టికలు ఎపిఎం అనురాధ బుధవారం అందజేశారు. ఈ సందర్భంగా ఎపిఎం మాట్లాడుతూ డ్వాక్రా గ్రూపుల్లోని చదులేని మహిళలను గుర్తించి వారికి ప్రతిరోజూ రెండు గంటలసేపు చదువు నేర్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో వెలుగు సిసిలు, విఒఎలు,వాలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.

నిత్యావసరాలు అందజేత

ప్రజాశక్తి-బల్లికువర

మండల పరిధిలోని అంబటిపూడి గ్రామంలో మంగళవారం రాత్రి విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా పల్లపు పద్మ ఇల్లు దగ్ధమైంది. రెవెన్యూ అధికారులు ఘటనా స్థలాన్ని బుధవారం సందర్శించారు. తక్షణ సహాయంగా బాధిత కుటుంబానికి 25 కిలోల బియ్యం, నిత్యావసర సరుకులు అందజేశారు. ఈ కార్యక్రమంలో తహశీల్దారు రవినాయక్, ఆర్ఐ పోతురాజు, నాయకులు దద్దాల అంజయ్య, మందలపు సుధాకర్ పాల్గొన్నారు.

పంచాయతీ రికార్డులు పరిశీలన

ప్రజాశక్తి- భట్టిప్రోలు

భట్టిప్రోలు గ్రామ పంచాయతీలో అవినీతి, అక్రమాలు జరిగాయని, విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని టిడిపి రాష్ట్ర కార్యదర్శి తూనుగుంట్ల సాయిబాబా గతంలో అధికారులకు ఫిర్యాదు చేశాడు. ప్రస్తుత పాలకవర్గం, గతంలో ప్రత్యేక అధికారుల పాలనలో నిధులు దుర్వినియోగమైనట్లు సాయిబాబా తన ఫిర్యాదులో పేర్కొన్నారు. స్పందించిన ఉన్నతాధికారులు ఐదు నెలల క్రితం పంచాయతీ రికార్డులను స్వాధీనం చేసుకొని ఇఒపిఆర్‌డి గదిలో భద్రపరి గదికి సీల్ వేశారు. అధికారులను ఐదు బందాలుగా మూడు విడతలుగా రికార్డులను పరిశీలించారు. గత డిసెంబర్‌లో ఉన్నతాధికారులు మరోమారు రికార్డులను క్షుణ్ణంగా తనిఖీ చేశారు. కాగా మిగిలిన రెండు సంవత్సరాల రికార్డులను బుధవారం పరిశీలించారు. నివేదికలను పంచాయతీరాజ్ శాఖ కమిషనర్‌కు అందజేయనున్నట్లు ంందని ఉమ్మడి గుంటూరు జిల్లా జిల్లా పరిషత్ సిఇఒ జ్యోతి బసు తెలిపారు. ఈ కార్యక్రమంలో డిఎల్‌డిఒలు కె.మంగపూర్ణనాథ్, వెంకట ప్రసాద్, రాఘవయ్య, గుంటూరు డిపిఒ శ్రీనివాసరావు, ఎఒ ప్రసాద్, సీనియర్ అసిస్టెంట్ కిరణ్‌కుమార్, రేపల్లె డిఎల్‌పిఒ నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

రికార్డులు పరిశీలిస్తున్న అధికారులు

మంత్రి పుట్టినరోజు వేడుకలకు ఏర్పాట్లు

ప్రజాశక్తి - రేపల్లె

రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ జన్మదిన వేడుకలకు శ్రీ సత్య సాయి స్కూల్ ప్రాంగణం ముస్తాబ్ అవుతోంది. ఈ నెల 10న రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ పుట్టినరోజు వేడుకలను స్థానిక శ్రీ భగవాన్ సత్య సాయి హైస్కూల్ ప్రాంగణంలో నిర్వహించేందుకు పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. మంత్రి సోదరులు అనగాని శివ ప్రసాద్, టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి పశ్చిమ డెల్టా ప్రాజెక్టు చైర్మన్ పంతాని మురళిధరరావు, టిడిపి నాయకులు ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నారు. ఈ సందర్భగా అనగాని శివప్రసాద్ మాట్లాడుతూ మంత్రి అనగాని జన్మదిన వేడుకలను పురస్కరించుకుని పట్టణానికి వచ్చే సహచర మంత్రులు, విఐపిలకు, పార్టీ నాయకులకు, కార్యకర్తలకు, సామాన్య ప్రజలకు వేరువేరుగా ప్రత్యేక గ్యాలరీలు ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు కలుగకుండా ప్రత్యేక జాగ్రత్త చర్యలు తీసుకుని వేడుకలు నిర్వహించేలా చర్యలు తీసుకున్నామన్నారు.

ఏర్పాట్లను పరిశీలిస్తున్న అనగాని శివప్రసాద్

సాగునీటి సదుపాయాలపై సమీక్ష

ప్రజాశక్తి - నగరం

వెల్లటూరు కెనాల్ పరిధిలోని ఆయకట్టు చివరి పొలాలకు నీరు అందించాలని సర్వసభ్య సమావేశం తీర్మానించింది. చివరి భూములకు సాగునీటిని అందించాలని కోరుతూ బుధవారం సర్వసభ్య నిర్వహించారు. ఈ సమావేశంలో నీటి సంఘాల ప్రెసిడెంట్లు, సంఘ సభ్యులు భీమేష్ కుమార్, అందె వీర రఘవయ్య, వెలగపూడి రవిప్రసాద్, చింతల వీరయ్య ,డ్రైనేజీ ఎఒ నత్తల రాంబాబు పాల్గొన్నారు. సందర్భంగా పంట కాలువలు మరియు కాలువల మరమ్మతులపై చర్చించారు. సభ్యులంతా ఏకగ్రీవంగా అభివద్ధి పనులకు మద్దతు ప్రకటించారు. కాలువల ద్వారా సాగునీరు సమర్థంగా అందించేందుకు తక్షణ చర్యలు తీసుకోవాలని నిర్ణయించారు. అదనంగా, నిధుల కేటాయింపుపై ప్రతిపాదనలు పంపి, పనులను వేగవంతం చేయాలని తీర్మానించారు. రైతులు సాగునీటి సరఫరాలో ఎదురవుతున్న ఇబ్బందులను వివరించగా, అధికారులు సమస్యల పరిష్కారానికి తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఇరిగేషన్ సిబ్బంది వెంకటేశ్వరావు,నాయకులు సాంబశివరావు పాల్గొన్నారు.

డ్రగ్స్‌కు దూరంగా ఉంటే ఉజ్వల భవిష్యత్తు

'మత్తుపై యుద్ధం' ప్రత్యేక గీతం ఆవిష్కరణలో ఎస్‌పి ఏఆర్ దామోదర్

మాట్లాడుతున్న ఎస్‌పి ఏఆర్ దామోదర్

ప్రజాశక్తి - ఒంగోలు కలెక్టరేట్

డ్రగ్స్‌కు దూరంగా ఉన్నప్పుడే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని జిల్లా ఎస్‌పి ఏఆర్ దామోదర్ పేర్కొన్నారు. గంజాయి వంటి మాదక ద్రవ్యాలు సేవించినా, విక్రయించిన, రవాణా చేసినా కఠిన చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు. నూకతోటి శరత్‌బాబు డ్రగ్స్‌పై రూపొందించిన ప్రత్యేక గీతాన్ని బుధవారం ఎన్టీఆర్ కళాక్షేత్రంలో ఎస్‌పి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఒంగోలు నగర మేయర్ గంగాడ సుజాత, సూర్యశ్రీ వికలాంగుల ట్రస్టు ఛైర్మన్ మండవ మురళీకృష్ణ ప్రసంగించారు. కార్యక్రమంలో ఒంగోలు డిఎస్‌పి ఆర్ శ్రీనివాసరావు, ఒంగోలు టూటౌన్ సిఐ ఎం.శ్రీనివాసరావు, ట్రాఫిక్ సిఐ వై.పాండురంగారావు, ఒంగోలు సిటిజన్ ఫోరం అధ్యక్షులు కొల్లా మధు, దశరథ, దుగ్గినేని వెంకట్రావు, ఎపిడబ్ల్యుజెఎఫ్ జిల్లా అధ్యక్షులు గొట్టిపాటి నాగేశ్వరరావు, ఏజె సొల్యూషన్ ప్రియా, పేస్ ఎన్ఆర్ ఒలింపియాడ్ స్కూల్ విద్యార్థులు పాల్గొన్నారు.

జిజిహెచ్‌లో ఐసోలేషన్ వార్డు ఏర్పాటు

సూపరింటెండెంట్ డాక్టర్ టి.జమున

జిజిహెచ్‌లో ఏర్పాటుచేసిన హెచ్‌ఎంపివి వార్డు

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు హెచ్‌ఎంపివి(హ్యూమన్ మెటానిమోనియో వైరస్) నివారణలో భాగంగా ఒంగోలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో 20 పడకలతో ఐసోలేషన్ వార్డు ఏర్పాటు చేశామని, నిపుణుల కమిటీతో పాటు పలు కమిటీలను నియమించామని సూపరింటెండెంట్ డాక్టర్ టి.జమున తెలిపారు. మగవారికి 10 బెడ్లు, మహిళలకు 10 బెడ్ల చొప్పున ఇసొలేషన్ వార్డ్ ఏర్పాటు చేశామని తెలిపారు. జనరల్ మెడిసిన్ విభాగాధిపతి డాక్టర్ కళ్యాణి నోడల్ అధికారిగా వ్యవహరిస్తారని తెలిపారు. పల్మనాలజీ, పీడియాట్రిక్స్, మైక్రోబయాలజీ, కమ్యూనిటీ మెడిసిన్, బయో కెమిస్ట్రీ విభాగాధిపతులతో కమిటీ ఏర్పాటు చేశామన్నారు ఆసుపత్రికి వచ్చే వారు, సాధారణ ప్రజలు వైద్యుల సలహా మేరకు తగు జాగ్రత్తలు పాటించాలని ఆమె కోరారు.

మాట్లాడుతున్న కలెక్టర్ వెంకటమురళి

జిల్లాని పర్యాటక ప్రాంతంగా తీర్చిదిద్దాలి

కలెక్టర్ జె.వెంకట మురళి

ప్రజాశక్తి-బాపట్ల జిల్లా

చారిత్రాత్మక సంపదను భద్రం చేస్తూ జిల్లాని పర్యాటక ప్రాంతంగా తీర్చిదిద్దాలని జిల్లా కలెక్టర్ జె వెంకటమురళి చెప్పారు. పర్యాటకశాఖ రాష్ట్ర ఉన్నతాధికారులతో బుధవారం స్థానిక కలెక్టర్ ఛాంబర్‌లో ఆయన ప్రత్యేకంగా సమావేశమయ్యారు. కాకతీయుల నాటి దేవాలయాలు, చోళుల నాటి దేవస్థానాలను వారసత్వ సంపదగా బాపట్ల జిల్లాలో ఉన్నాయని తెలిపారు. చారిత్రాత్మకమైన దేవస్థానాలను పర్యాటక ప్రాంతంగా తీర్చిదిద్దాలని సూచించారు. బాపట్ల సూర్యలంక బీచ్‌ని అభివద్ధి చేస్తే పర్యాటకల సంఖ్య మరింత పెరుగుతుందన్నారు. చిన్నగంజాం మండలంలో కాకతీయుల నాటి మోటుపల్లి బీచ్ వద్దనే వీరభద్ర స్వామి ఆలయం ఉందని కలెక్టర్ చెప్పారు. ఆనాటి అభయ శాసనం ఆలయం వద్ద ఉందని వివరించారు. 2000 సంవత్సరాల క్రితం నాటి బుద్ధ స్తూపం భట్టిప్రోలు మండలంలో ఉందన్నారు. వేటపాలెం మండలంలో సుమారు 200 సంవత్సరాల నాటి సారస్వతం గ్రంథాలయం ఉందన్నారు. మహాత్మా గాంధీ ఇక్కడకు వచ్చి సందర్శించినట్లు వివరించారు. బాపట్ల మండలం పేరళి గ్రామంలో పర్యాటకులు బోట్లతో షికారు చేయడానికి సౌలభ్యం ఉందన్నారు. పర్యాటక శాఖ ద్వారా నిధులు కేటాయించి వీటిని అభివద్ధి చేస్తే బాపట్ల జిల్లా పర్యాటక ప్రాంతంగా మారనుందని తెలిపారు. సమావేశంలో పర్యాటక శాఖ ఆపరేషన్ రాష్ట్ర ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ పద్మావతి, శివషరమ్ పాల్గొన్నారు.

నేడు చీరాలలో కేంద్ర బృందం పర్యటన

'ఒకే జిల్లా ఒకే ఉత్పత్తి' నినాదంతో చీరాల సిల్క్ శారీస్, ఉప్పాడ వస్త్రాల ఎంపిక

మాట్లాడుతున్న కలెక్టర్ వెంకటమురళి

ప్రజాశక్తి-బాపట్ల జిల్లా

దేశస్థాయిలో ఒకే జిల్లా ఒకే ఉత్పత్తి అనే నినాదంతో బాపట్ల జిల్లా చీరాల సిల్క్ శారీస్, ఉప్పాడ వస్త్రాలను ఎంపిక చేయడానికి కేంద్ర బృందం ఈ నెల 9వ తేదీన జిల్లాకు వస్తున్నట్లు జిల్లా కలెక్టర్ జె.వెంకటమురళి చెప్పారు. బుధవారం స్థానిక కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో ఒకే జిల్లా ఒకే ఉత్పత్తి బందం పర్యటన వివరాలను చేనేత జౌళి శాఖ అధికారులు జిల్లా కలెక్టర్‌కు వివరించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ చీరాల సిల్క్ శారీస్‌ను, ఉప్పాడ వస్త్రాలను జాతీయ స్థాయిలో అవార్డుకు ఎంపిక చేయడానికి కేంద్ర బందం సభ్యులు ఇద్దరు గురువారం జిల్లాలో పర్యటించనున్నారని తెలిపారు. కేంద్ర బందం సభ్యులు ఇష్‌దీప్, డాక్టర్ దివ్యా విజయవాడ నుండి బయలుదేరి బాపట్ల జిల్లా కేంద్రానికి ఉదయం 10 గంటలకు చేరుకుంటారన్నారు. అనంతరం జిల్లా కలెక్టరేట్‌లోని విసి హాల్‌లో చేనేత సహకార సంఘాలు ఏర్పాటు చేసిన ప్రదర్శనను పరిశీలిస్తారన్నారు. ఉదయం 11.30 గంటలకు చీరాల మండలం ఈపూరుపాలెం గ్రామంలో సమత శిక్షణ కేంద్రాన్ని పరిశీలిస్తారు. మధ్యాహ్నం 12 గంటలకు దేశాయిపేట గ్రామంలోని డయింగ్ యూనిట్‌ను పరిశీలిస్తారు. మధ్యాహ్నం ఒంటి గంటకు జాండ్రపేటలోని చేనేత కార్మికులకు గహాలకు వెళ్లి పరిశీలిస్తారని, సాయంత్రం 3.30 గంటలకు గౌతమ్ హ్యాండ్లూమ్స్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థను పరిశీలిస్తారని చెప్పారు. అనంతరం సాయంత్రం నాలుగు గంటలకు మహాత్మా గాంధీ క్లాత్ మార్కెట్ ను సందర్శిస్తారని ఆయన చెప్పారు. సమావేశంలో చేనేత జౌళి శాఖ జాయింట్ డైరెక్టర్ కె. కన్నబాబు, రీజనల్ జాయింట్ డైరెక్టర్ భీమయ్య తదితరులు పాల్గొన్నారు.

నమోదు తీరును పరిశీలిస్తున్న కలెక్టర్

ఆరేళ్ల లోపు పిల్లలకు ఆధార్ మంజూరు

శిబిరాన్ని సందర్శించిన కలెక్టర్

ప్రజాశక్తి - ఒంగోలు కలెక్టరేట్

ఆరేళ్లలోపు పిల్లలందరికీ ఆధార్ కార్డు మంజూరు చేసేలా అధికార యంత్రాంగం చర్యలు చేపట్టినట్లు కలెక్టర్ ఏ. తమీమ్ అన్సారియా తెలిపారు. బుధవారం ఒంగోలులోని ఇస్లాంపేటలో ఏర్పాటు చేసిన బాల ఆధార్ నమోదు శిబిరాన్ని ఆమె సందర్శించారు. ఆధార్ కార్డు కోసం పిల్లల వివరాలను నమోదు చేస్తున్న తీరును పరిశీలించారు. జిల్లావ్యాప్తంగా ఆధార్ కార్డు కోసం 605 మంది వివరాలను సేకరించారు. కార్యక్రమంలో జడ్పీ సిఈఓ బి.చిరంజీవి, ఐసిడిఎస్ ప్రాజెక్ట్ డైరెక్టర్ బి.హేనా సుజన్, సిడిపిఓలు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

'పోస్టులకు' దరఖాస్తుల ఆహ్వానం

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ పరిధిలోని పిహెచ్‌సిల్లో ఖాళీగా ఉన్న ఎఫ్ఎన్ఓ(ఫిమేల్ నర్సింగ్ ఆర్డినరీ), శానిటరీ అటెండర్ కం వాచ్‌మెన్ పోస్టులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు డిఎంహెచ్ఓ డాక్టర్ టి.వెంకటేశ్వర్లు ఓ ప్రకటనలో తెలిపారు. ఆయా పోస్టులకు ఈనెల 9 నుంచి 18 లోపు దరఖాస్తులు స్వీకరిస్తామన్నారు. సంబంధిత నోటిఫికేషన్, అప్లికేషన్ నమూనాను, సర్వీస్ సర్టిఫికేట్ నమునా, నివాస ధృవీకరణ నమూనా పత్రాలను ప్రభుత్వ జిల్లా వెబ్‌సైట్ ప్రకాశం డాట్ ఏపి డాట్ జిఒవి డాట్ ఇన్‌లో పొందుపరిచామన్నారు. అర్హులైన అభ్యర్థులు పూర్తి చేసిన ధరఖాస్తులను జిల్లావైద్య ఆరోగ్యశాఖాధికారి కార్యాలయంలో రుసుము ఇతర ధృవపత్రాల జతపరిచి స్వయంగా ఈనెల 9 నుంచి 19 వరకు (ప్రభుత్వ సెలవు రోజులు మినహా) సాయంత్రం 5.00 గంటలలోపు సమర్పించాలన్నారు. గడువు తరువాత వచ్చిన దరఖాస్తు. పై గడువు తరువాత అప్లికేషన్లను ఎట్టి పరిస్థితులలో స్వీకరించమని డిఎం,హెచ్ఒ స్పష్టం చేశారు.

రోడ్లపై కూరగాయలు విక్రయిస్తే చర్యలు

ఎమ్మెల్యే నరేంద్రవర్మ

విక్రయదారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

ప్రజాశక్తి-బాపట్ల

పట్టణంలో రైతుబజార్ బయట మార్కెట్ పరిసరాల్లో రోడ్లపై వ్యాపారులు కూరగాయలు విక్రయించకుండా చూడాలని బాపట్ల శాసన సభ్యులు వేగేసిన నరేంద్రవర్మ అధికారులను ఆదేశించారు. బుధవారం ఉదయం బాపట్ల కూరగాయల మార్కెట్ రైతుబజార్‌ను నరేంద్రవర్మ మున్సిపల్ కమిషనర్ రఘునాథరెడ్డితో కలిసి సందర్శించారు. బాపట్ల రైతుబజార్ నిరుపయోగంగా ఉండటానికి వీల్లేదన్నారు. ప్రతి రైతు, రైతు బజార్‌లోనే తమ ఉత్పత్తులైన కూరగాయలు ఆకుకూరలను అమ్ముకునే విధంగా చర్యలు తీసుకోవాలని నరేంద్రవర్మ అధికారులను ఆదేశించారు. హోల్‌సేల్ కూరగాయల వ్యాపారులు క్రయవిక్రయాలు జరుపుకునే విధంగా జి.బి.సి. రోడ్డు విలియంబుత్ కళాశాల దగ్గరలో ప్రభుత్వ స్థలాన్ని ఎమ్మెల్యే నరేంద్ర వర్మ పరిశీలించారు. అక్కడ స్థలాన్ని చదును చేసి ఉపయోగించుకునే విధంగా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. మార్కెట్ కు వచ్చే ప్రజలకు అసౌకర్యం కలగకుండా చూస్తామని, స్వయంగా తానే ప్రతిరోజూ ఉదయం మార్కెట్‌ను, రైతు బజార్లను సందర్శిస్తానన్నారు. అనంతరం జి.బి.సి రోడ్డులోని డ్రైనేజీని పరిశీలించారు. మార్కెట్ బయట నిర్మించిన ఆక్రమణలను జెసిబితో ఎమ్మెల్యే దగ్గరుండి తొలగింపజేశారు. ఎమ్మెల్యే వెంట టిడిపి పట్టణ అధ్యక్షులు గొలపల శ్రీనివాసరావు, పట్టణ ప్రణాళిక అధికారి యస్.మల్లికార్జునరావు, మున్సిపల్ ఏఈ డి.ప్రసాద్, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లు శివరామకష్ణ, షేక్ ఇమామ్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ డి.శ్రీనివాసరావు, పురపాలక సంఘ సిబ్బంది పాల్గొన్నారు.

అమిత్ షా రాజీనామా చేయాలి

డిసిసి అధ్యక్షులు షేక్ సైదా

మాట్లాడుతున్న షేక్ సైదా

ప్రజాశక్తి - ఒంగోలు కలెక్టరేట్

పార్లమెంట్‌లో డాక్టర్ బిఆర్ అంబేద్కర్‌ని అవమానించిన కేంద్ర హోం మంత్రి అమిత్ షా రాజీనామా చేయాలని, ప్రధానమంత్రి మోడీ క్షమాపణ చెప్పాలని జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు షేక్ సైదా డిమాండ్ చేశారు. జిల్లా కాంగ్రెస్ కమిటీ కార్యాలయంలో బుధవారం జరిగిన పాత్రికేయుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ అమిత్‌షా అంబేద్కర్‌ని అవమానించినందుకు పిసిసి పిలుపు మేరకు జిల్లా వ్యాప్తంగా కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో జై బాపూజీ, జై భీమ్, జై సంవిధాన్! పేరుతో పలు కార్యక్రమాలు చేపడుతున్నామన్నారు. జిల్లాలోని అన్ని నియోజకవర్గాల్లో దళిత సర్పంచ్‌లు, మున్సిపల్ చైర్మన్, కార్పొరేషన్ మేయర్లను కలిసి అమిత్ షా రాజీనామా కోసం పంచాయతీ, మున్సిపల్, కార్పొరేషన్ స్థాయిలో తీర్మానం చేయవలసిందిగా వినతి పత్రాలు ఇస్తామన్నారు. ఈ నెల 12న ప్రతి అసెంబ్లీ నియోజకవర్గంలోని ప్రధాన కూడళ్లలో రాజ్యాంగ పీఠిక ఒక పేజీని ప్రజలకు పంపిణీ చేస్తామని, 12న ఒంగోలులో ప్రధాన కూడళ్ల నుండి అంబేద్కర్ విగ్రహం వరకు పాదయాత్ర చేస్తామన్నారు. సమావేశంలో కాంగ్రెస్ ఒంగోలు అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌చార్జి బిఆర్ గౌస్, జిల్లా ఉపాధ్యక్షులు షేక్ రసూల్, జిల్లా కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధి మన్నం ప్రసన్నరాజు పాల్గొన్నారు.

రోగుల పట్ల మర్యాదగా ప్రవర్తించండి

డిఎంహెచ్ఓ డాక్టర్ టి.వెంకటేశ్వర్లు

ప్రజాశక్తి - ఒంగోలు కలెక్టరేట్

ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి వచ్చే రోగుల పట్ల మర్యాదగా ప్రవర్తించాలని, సమయ పాలన పాటించాలని జిల్లా వైద్య, ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ టి.వెంకటేశ్వర్లు ల్యాబ్ టెక్నీషియన్లను ఆదేశించారు. ఒంగోలు పాత రిమ్స్‌లోని జిల్లా మలేరియా కార్యాలయంలో బుధవారం డిఎం,హెచ్ఓ ల్యాబ్ టెక్నీషియన్లతో సమీక్షా సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లా మలేరియా అధికారి డాక్టర్ వి.శ్రావణ్ కుమార్, ఏఎంఓ పి శ్రీనివాసులు, ఎస్‌యుఓ సాగర్, ల్యాబ్ టెక్నీషియన్స్ పాల్గొన్నారు.